RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

కర్నూలు సంపుటి : 04 సంచిక : 23 శనివారం 11-05-2024 పేజీలు :04 వెల:రూ.2.00

## జగనన్న వ్యాఖ్యలపై కన్నీరు పెట్టుకున్న వైఎస్ షర్మిల

అమరావతి : ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యాఖ్యలపై సోదరి కడప ఎంపీ అభ్యర్థి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కన్నీటిపర్యంతం అయ్యారు. జగనన్న కోసం అనేక త్యాగాలు చేస్తే అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. కడప కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తనను నెపోటిజంతో పోల్చడంపై ఆవేదన వ్యక్తం చేశారు.రాజకీయంలో బంధువులుండరాదని జగన్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. జగన్ బంధువులు రవీందర్‌నాథ్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అవినాష్‌రెడ్డి, తల్లి విజయమ్మ తదితరులు రాజకీయంలో ఉంటే నెపోటిజం కాదు. చెల్లెలు షర్మిల ఒక్కతే రాజకీయంలో ఉంటే నెపోటిజం కిందకు వస్తుందా అంటూ ప్రశ్నించారు. జగన్‌ను అరెస్టు చేసినపుడు వేలాది కిలోమీటర్లు పాదయాత్రలు చేశానని, తండ్రి వైఎస్సార్ చనిపోయినపుడు ఓదార్పు యాత్ర చేశానని వెల్లడించారు. ఇదంతా ఎలాంటి స్వార్థం లేకుండా జగన్ కోసమే చేశానని స్పష్టం చేశారు.జగన్ ముఖ్యమంత్రి అయ్యేంత వరకు నాలో రాజకీయం, డబ్బు కాంక్ష లేదని, ఏది చేసినా జగన్ భవిష్యత్, జగన్‌కు ముఖ్యమంత్రి పదవి కోసం తాను త్యాగం చేశానని వెల్లడించారు. ఈ విషయంలో తాను బైబిల్‌పై ప్రమాణం చేస్తానని, నువ్వు చేస్తావా అంటూ జగన్‌ను ప్రశ్నించారు.

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

# 'నకిలీ శివసేన వ్యక్తులు నన్ను సజీవ సమాధి చేస్తారట'.. ప్రధాని సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మహారాష్ట్రలోని నందుర్‌బార్‌లో జరిగిన భారీ ర్యాలీలో ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌తో పాటు శివసేన (యూబీటీ)ని కూడా తీవ్రంగా దుయ్యబట్టారు.నకిలీ శివసేన వ్యక్తులు నన్ను సజీవ సమాధి చేయాలని చూస్తున్నారని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈ వ్యక్తులు మోదీ సమాధి తవ్వుతానంటున్నారు. మోదీని మట్టి కరిపిస్తామంటూ కలలు కంటున్నారు. వారి రాజకీయ దురుద్దేశ్యం ఎంతగా దిగజారిందో తెలుసుకోవాలన్న మోదీ, దేశంలోని తల్లులు, సోదరీమణులు రక్షణగా ఉన్నంతవరకు ఎవరు ఏం చేయలేరన్నారు.మోదీ మీ సమాధి తవ్వుతారని కాంగ్రెస్ ప్రజలు అంటున్నారని ప్రధాని అన్నారు. ఈ వ్యక్తులు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం తమకు ఇష్టమైన పదాలను ఉపయోగిస్తున్నారు. నకిలీ శివసేన సభ్యులు బాంబు పేలుళ్ల దోషులను తమతో పాటు ప్రచారానికి తీసుకెళ్లడం ప్రారంభించారని ప్రధాని అన్నారు. దాణా కుంభకోణంలో దోషిగా తేలిన వ్యక్తిని భుజాలపై వేసుకుని బీహార్‌లో తిరుగుతున్నారు. బాలాసాహెబ్ ఠాక్రే ప్రతిష్టను దెబ్బతీయడానికి వీళ్లు ప్రయత్నిస్తున్నారని ప్రధాని అన్నారు.మహా అఘాడి (ఓఎం) రిజర్వేషన్‌ను నరమాంస భక్షకానికి పెద్దపీట వేస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. అదే సమయంలో ఎస్సీ-ఎస్టీ-ఓబీసీల రిజర్వేషన్లను కాపాడేందుకు మోదీ మహారక్షణ మహాయజ్ఞం చేస్తున్నారన్నారు. నేను కాంగ్రెస్ రాజకుటుంబం లాంటి పెద్ద కుటుంబం నుంచి రాలేదన్న మోదీ, పేదరికంలో పెరిగాను. ఇక్కడ ఎన్ని కష్టాలు పడ్డానో నాకు తెలుసు. మీ జీవితంలో కూడా కష్టాల పర్వతాలు ఉన్నాయి. చాలా గిరిజన కుటుంబాలకు శాశ్వత ఇళ్లు లేవు. స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు గడుస్తున్నా గ్రామాలకు కరెంటు రాలేదు. వాటన్నింటిని నేరవేర్చేందుకు అండగా ఉంటానని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు.'ప్రతి పేద, ప్రతి గిరిజనుడికి ఇల్లు, ప్రతి గిరిజనుడి ఇంటికి నీరు, ప్రతి కుటుంబానికి నీటి సౌకర్యం, ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని మోదీ ప్రతిజ్ఞ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నందుర్‌బార్‌లోని దాదాపు 1.25 లక్షల మంది పేదలకు శాశ్వత ఇళ్లు అందించామన్నారు. గత 10 ఏళ్లలో 4 కోట్ల పక్కా ఇళ్లు ఇచ్చామని, మూడో టర్మ్‌లో మరో 3 కోట్ల ఇళ్లు ఇస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం పథకాల ప్రయోజనాలను వివరించిన ప్రధాని మోదీ, 'ఎన్‌డిఎ ప్రభుత్వం మహారాష్ట్రలోని 20 వేలకు పైగా గ్రామాలలో ప్రతి ఇంటికి నీటిని అందించింది. ఇందులో నందుర్‌బార్‌లోని 111 గ్రామాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఇది ట్రైలర్, ఇంకా చాలా చేయాల్సి ఉంది. అందుకే మరోసారి అవకాశం కల్పించాలని ప్రధాని మోదీ కోరారు.

# చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోవద్దు : ఏపీ సీఎం వైఎస్ జగన్



అమరావతి : సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చే చంద్రబాబు ను ఈ ఎన్నికల్లో నమ్మి మరోసారి మోసపోవద్దని ఏపీ సీఎం వైఎస్ జగన్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం పుత్తూరు గ్రామంలో నిర్వహించిన వైసీపీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 2014లో కూటమి తరుపున చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో లో ఓ ఒక్కటి అమలు చేయలేదని ఆరోపించారు.రైతు రుణ మాఫీపై తొలి సంతకం, పొదుపు సంఘాల రుణాల వడ్డీ మాఫీ, ఆడబిడ్డ పుడితే మహాలక్ష్మి పథకం కింద రూ. 25 వేలు, ఇంటికో ఉద్యోగం, ప్రతినెల నిరుద్యోగ భృతి అన్నారు. వీటిలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన వారందరికీ మూడు సెంట్ల భూమి ఇవ్వలేదని ఆరోపించారు. 14 ఏండ్ల చంద్రబాబు పాలనలో ఏనాడు కూడా ప్రజలకు మంచి చేసింది లేదని దుయ్యబట్టారు.వైసీపీ 59 నెలల పాలనలో ఏనాడు లేనివిధంగా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని జగన్ వెల్లడించారు. రాష్ట్రంలో 93 శాతం విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్‌ను కడుతున్నామని, మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి 99శాతం హామీలను అమలు చేశామని పేర్కొన్నారు. ఇంటి వద్దకే రేషన్, పింఛన్ల పంపిణీ, పౌరసేవలు అందిస్తున్నామని తెలిపారు. లంచాలు లేని వ్యవస్థను తీసుకొచ్చామని గుర్తు చేశారు.

## సింహాచలం అప్పన్న నిజరూప దర్శనం

### స్వామి దర్శనం కోసం భారీగా చేరుకున్న భక్తులు
### తొలిదర్శనం చేసుకున్న అశోకగజపతి దంపతులు

విశాఖపట్టణం,మే10: వైశాఖ శుద్ధ తదియ పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాచలంలో చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఒంటి గంటకు సుప్రభాత సేవతో అప్పన్న స్వామిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి దేహంపై ఉన్న చందనాన్ని తొలగించి నిజరూపంలోకి తీసుకొచ్చారు. వేకువజాము నుంచే సింహగిరిపై భక్తులు బారులు తీరారు. గోవింద నామాలతో సింహాచల పుణ్యక్షేత్రం మారుమోగుతోంది. ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం అప్పన్న స్వామి చందనోత్సవం సందర్భంగా స్వామి భక్తులకు నిజరూప దర్శనం ఇస్తున్నారు. ఆలయ అనువంశీ ధర్మకర్త అశోక్‌గజపతి రాజు కుటుంబ సభ్యులు తొలి పూజ చేసుకున్నారు. అలాగే స్వరూపానంద సరస్వతి, దేవదాయ శాఖ, అధికారులు, పలువురు న్యాయమూర్తులు.. స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారి జాము మూడు గంటల నుంచి ఆలయ అధికారులు సాధారణ భక్తులకు దర్శనం కల్పించారు. గత ఏడాది ఇబ్బందుల నేపథ్యంలో ఈసారి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



స్వామివారి నిజరూప దర్శనం చేసుకునేందుకు భక్తులు పోటెత్తారు. కాగా స్వామి వారి నిజరూపాన్ని భక్తులు దర్శించుకునేందుకు ఈ నేల 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు టికెట్లు విక్రయించారు. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని సింహాద్రి అప్పన్న చందనోత్సవం నిర్వహిస్తున్నారు. స్వామివారి నిజరూప దర్శన టికెట్లు రూ.300, రూ.వెయ్యి టికెట్లు బ్యాంకుల ద్వారా, సింహగిరిపై టికెట్ల విక్రయ కేంద్రాల ద్వారా భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ టికెట్లు లేని భక్తులు ఉచిత దర్శనం క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకోవచ్చు. సింహాద్రి అప్పన్నకు అక్షయ తృతీయ రోజున జరిగే చందనోత్సవం చాలా విశిష్టమైనది.

## ఈసీ ఉత్తర్వులపై ఒకరోజు స్టే

### 13 తరవాతే పథకాలకు నిధుల విడుదల
### హైకోర్టు ఆదేశాల మేరకు అధికారుల ఏర్పాట్లు

అమరావతి,మే10, రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ), విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు లబ్దిదారులకు జమచేయవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అంటే 13న ఎన్నికలు పూర్తయిన తరవాతనే పంపిణీ చేపట్టాలని సూచించింది. మరోవైపు ఈ నెల 13న ఓటింగ్ ముగిసేవరకు ఈ పథకాలకు సంబంధించిన నిధులను జమచేయవద్దంటూ ఈసీ ఈనెల 9న ఇచ్చిన ఉత్తర్వులను 10 వరకు తాత్కాలికంగా పక్కనపెట్టింది. నిధుల పంపిణీకి ఏవిధంగాను ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం చేయవద్దని స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రవర్తన నియమావళిని అతిక్రమించేలా వేడుకలు నిర్వహించవద్దని.. నేతల జోక్యం లేకుండా చూడాలని తేల్చిచెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ గురువారం రాత్రి ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చారు. ప్రధాన వ్యాజ్యాలపై కౌంటర్ వేయాలని ప్రతివాదులను ఆదేశించారు. ఈ నెల 13న పోలింగ్ తేదీ ముగిసే వరకు పెట్టుబడి రాయితీ, విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల సొమ్ము రూ.14,165 కోట్లను లబ్దిదారుల ఖాతాల్లో జమచేయకుండా నిలువరిస్తూ 9న ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని, అంతకు ముందు ఈసీ జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హైకోర్టులో పలువురు వ్యాజ్యాలు దాఖలు చేశారు. వీటిపై గురువారం హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది.ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ వాదనలు వినిపించారు. పోలింగ్ ఈ నెల 13తో ముగుస్తుందని, ఆ తర్వాత రోజు రైతులకు పెట్టుబడి రాయితీ, విద్యా దీవెన, చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల నిధులను జమచేస్తే అభ్యంతరం లేదన్నారు. ఎన్నికల ప్రక్రియ (జూన్ 6) ముగిసే వరకు నిధులను జమచేయవద్దని గతంలో నిర్ణయం తీసుకున్నామని, రాష్ట్ర ప్రభుత్వం తాజాగా సమర్పించిన వివరాలను పరిశీలించాక పోలింగ్ ముగిసిన మరుసటి రోజు జమచేయవచ్చని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సమాన అవకాశాలు దెబ్బతీయకుండా, లబ్దిదారులను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సొమ్మును జమచేసే విషయంలో రెండుమూడు రోజులు వేచిచూస్తే వచ్చే నష్టమేమీ లేదన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు జూన్ 6 వరకు ఉన్నప్పటికీ.. ఓటింగ్ అయిన మరుసటి రోజే సొమ్ము జమకు అనుమతి ఇచ్చామన్నారు. వివిధ పథకాల కింద లబ్దిదారులకు రూ. 14,165 కోట్ల పంపిణీకి రాష్ట్రప్రభుత్వం అనుమతి కోరిందన్నారు. ఎన్నికలకు ముందు అంత పెద్దమొత్తంలో సొమ్మును జమచేస్తే ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడుతుందన్నారు. పథకాల సొమ్ము విడుదలకు కొందిమంది మాత్రమే హైకోర్టులో వ్యాజ్యాలు వేశారన్నారు. 13వ తేదీ లోపే నిధులను తమ ఖాతాల్లో జమచేయాలని కోరే హక్కు పిటిషనర్లకు లేదని వాదించారు. మరోవైపు ఈసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాష్ట్రప్రభుత్వం వ్యాజ్యం దాఖలు చేయలేదని, లబ్దిదారులు కొందరు మాత్రమే వ్యాజ్యాలు వేశారని గుర్తుచేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి కొత్త పథకాలతోపాటు అమల్లో ఉన్న పథకాలకూ వర్తిస్తుందని వివరించారు. ఆసరా, చేయూత, ఈబీసీ నేస్తం పథకాల లబ్దిదారులకు ఏడాదికి ఆరోజుల ముందు సొమ్ము జమచేస్తే ఎన్నికలను ప్రభావితం చేసినట్లవుతుందని తెలిపారు. అధికార పార్టీ అభ్యర్థులకు ఎన్నికల్లో అనుచిత లబ్ది కలగకుండా అన్ని పార్టీలకూ సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఈసీపై ఉందన్నారు. పథకాలకు నిధులను విడుదల చేస్తున్నట్లు ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ప్రభుత్వం ప్రకటించిందని, అయితే లబ్దిదారుల ఖాతాల్లో సొమ్ము జమచేసేందుకు ఇంత జాప్యం ఎందుకు జరిగిందో తెలియజేస్తూ ప్రభుత్వం సమర్పించిన వినతిలో పేర్కొన్న కారణాలు సహేతుకంగా లేవని ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్ పేర్కొన్నారు. వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు.

## జగన్ వద్ద డబ్బులున్నాయి.. కూటమి వద్ద నీతి ఉంది : చంద్రబాబు



అమరావతి : అవినీతి, అక్రమాలతో సంపాందించిన డబ్బుతో ఏపీ సీఎం జగన్ ఎన్నికల్లో పోటీ చేస్తుంటే కూటమి నీతి, నిజాయితీతో పోటీ చేస్తుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. తిరుపతి గన్నవరంలో కూటమి తరుపున నిర్వహించిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.గన్నవరం లో భారీ వర్షం కురుస్తున్నా వర్షంలోనే బాబు ప్రసంగాన్ని కొనసాగించారు. ల్యాండ్ టైటిలింగ్ ద్వారా ప్రజల ఆస్తులను జగన్ సొంతం చేసుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. కూటమి అధికారంలో వస్తే ఆ చట్టాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగులను లోబర్చుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నించగా అడ్డుకుని తిప్పిపంపారని, బ్యాలెట్ పోలింగ్‌లో నూటికి 90 శాతం మంది ఉద్యోగులు కూటమికే ఓట్లు వేశారని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగస్థులను అభినందించారు.కూటమి అధికారంలోకి రాగానే ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. హలో ఏపీ అంటే.. బైబై జగన్ అంటూ నినాదాలు చేయించారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలను వీరోచితంగా పోరాడుతున్న యార్లగడ్డ వేంకట్రావుకు భవిష్యత్‌లో సముచిత గౌరవం ఇస్తానని పేర్కొన్నారు.

## భూమా గెలుపే తమ లక్ష్యం....

### యర్రం ప్రతాపరెడ్డి.ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి, జనసేన నాయకులు.




నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-భూమా గెలుపే తమ లక్ష్యంగా భావించి యర్రం ప్రతాపరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని పెద్ద కంబలూరు గ్రామంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ను భారీ మెజార్టీతో గెలిపియడమే తమ లక్ష్యంగా భావించి ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రతి అవ్వా, తాతలకు ప్రతి ఓటరుకు ఎన్నికల మేనిఫెస్టోను పంచుతూ సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి వేయించి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భూమా అఖిలప్రియ ను భారీ మెజార్టీతో గెలిపించాలని టిడిపి నాయకులు యర్రం ప్రతాపరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఊరట..

### మధ్యంతర బెయిల్ మంజూరు..

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుప్రీంకోర్టు శుక్రవారం (మే 10) కేజ్రీవాల్‌కు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.విచారణ సందర్భంగా.. అందరి వాదనలు



విన్న న్యాయస్థానం.. జూన్ 1 వరకు మధ్యంతర విడుదలను మంజూరు చేయబోతున్నామని తెలిపింది. మరోవైపు ఢిల్లీ సీఎం అరెస్ట్‌పై దాఖలైన పిటిషన్‌పై జూలైలో విచారణ జరపాలని కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ డిమాండ్ చేశారు.దీనిపై వచ్చే వారంలో కేజ్రీవాల్ పిటిషన్‌పై చర్చను ముగించేందుకు ప్రయత్నిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. గడువు ముగిసిన తర్వాత లొంగిపోవాల్సిందిగా అరవింద్ కేజ్రీవాల్‌ను కోరాలని న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనాన్ని ఈడీ తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ అభ్యర్థించారు. దీనిపై ఢిల్లీ సీఎం జూన్ 2న లొంగిపోవాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. మధ్యంతర బెయిల్ మంజూరు చేసేటప్పుడు కోర్టు షరతుల గురించి చెప్పేది ఏమీ లేదు.గత విచారణలో, అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. కేజ్రీవాల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ ఈడీ గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. చట్టాలు అందరికీ ఒకటేనని, లోక్‌సభ ఎన్నికలకు ప్రచారం చేయడం ప్రాథమిక, రాజ్యాంగపరమైన లేదా చట్టబద్ధమైన హక్కు కాదని దర్యాప్తు సంస్థ పేర్కొంది. ప్రచారం కోసం ఏ రాజకీయ నాయకుడికి బెయిల్ మంజూరు కాలేదని దర్యాప్తు సంస్థ తెలిపింది. ౦ంఖ అభ్యర్థుల కోసం ప్రచారం చేయడానికి కేజ్రీవాల్‌ను జైలు నుండి అనుమతించడం తప్పుడు సంకేతం ఇస్తుందని కోర్టు పేర్కొంది.

ప్రస్థానం



# సంపాదకీయం

శనివారం 11-05-2024

## కూటమిలో కుమ్ములాటలు

కేంద్రంలో అప్రతిహతంగా కొనసాగుతున్న మోడీ నేతృత్వం లోని ఎన్‌డిఎ ప్రభుత్వానికి ముగింపు పలకాలన్న ప్రధాన లక్ష్యంతో విపక్షాల సమైక్య 'ఇండియా' కూటమిలో కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. సీట్ల సర్దుబాటు నుంచి ప్రచారాల వరకు ఎక్కడో ఒక చోట పొరపొచ్చాలు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల కూటమి ఒప్పందానికి విరుద్ధంగా కొన్ని పార్టీలు తమ అభ్యర్థులను నేరుగా పోటీలోకి దింపాయి. ఇప్పటికీ పశ్చిమబెంగాల్, ఢిల్లీ, పంజాబ్, కేరళ వంటి రాష్ట్రాల్లో కూటమి ఐక్యత అంతగా కనిపించడం లేదు. జాతీయ స్థాయిలో తామంతా కూటమి లోనే కలిసికట్టుగా ఉన్నామని చెబుతున్నా ఆయా రాష్ట్రాల క్షేత్రస్థాయిలో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నాయి కేరళలోని కూటమి పార్టీల మధ్యనే తీవ్ర పోటీ ఏర్పడడం చర్చనీయాంశం అవుతోంది. కేరళలో సిపిఎం నేతృత్వం లోని లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) వామపక్ష ప్రభుత్వం ఇప్పుడు అధికారంలో ఉంది. అయితే ఇక్కడ ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీయే. జాతీయ స్థాయిలో ఈ రెండు పార్టీలు మిత్రపక్షాలు అయినప్పటికీ కేరళలో మాత్రం పోటీపడుతున్నాయి. ముఖ్యంగా కేరళలోని వాయినాడ్ నియోజకవర్గంలో పోరు తీవ్ర స్థాయిలో ఉంది. వాయినాడ్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) మద్దతుతో పోటీలో ఉండగా, ఎల్‌డిఎఫ్ తరపున సిపిఐ సీనియర్ నాయకురాలు అన్నేరాజా రంగంలో ఉన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా సిపిఐ తరపున పిపి సునీల్ పోటీ చేశారు. బిజెపి అభ్యర్థిగా ఆ పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు కె. సురేంద్రన్ పోటీ చేస్తున్నారు. రాహుల్‌కు వామపక్షాల నుంచే కాకుండా బిజెపి నుంచి కూడా పోటీ తప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో లెఫ్ట్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) అధినేత , ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ అవినీతి ఆరోపణలు చేస్తూ బహిరంగంగా విమర్శిస్తున్నారు. అవినీతి కేసులతో పినరయి విజయన్‌కు ప్రత్యక్షంగా సంబంధాలు ఉన్నట్టు ఎలాంటి రుజువులు లేకపోయినా, ఉన్నట్టు అపోహలు సృష్టిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) లేదా సిబిఐ పినరయిని అరెస్ట్ చేసి ఎందుకు విచారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. తిరువనంతపురం విమానాశ్రయం ద్వారా స్మగ్లింగ్ అయిన బంగారం కేసులో పినరయి విజయన్‌కు సంబంధం ఉన్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఈ స్మగ్లింగ్ కేసు నిందితుల్లో కొందరితో పినరయి విజయన్ మాజీ ప్రైవేట్ సెక్రటరీ, సీనియర్ ఐఎఎస్ అధికారికి సన్నిహిత సంబంధం ఉన్నట్టు కేవలం అనుమానాలే ఉన్నాయి. వీటిని ఆసరా చేసుకుని పినరయిని కేసులో ఇరికించాలన్న ప్రయత్నాలు కూడా జరిగాయి. ఇదే విధంగా విజయన్‌పై వ్యతిరేకంగా యునైటెడ్ డెమొక్రాటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) లోపాలను వెతుకుతోంది. దేశం మొత్తం మీద వామపక్ష పార్టీ నేతల్లో ఎవరి మీదా అవినీతి మచ్చలేదన్నది వాస్తవం. వామపక్షాలతో పోటీ పడడం యుడిఎఫ్‌కు అనివార్యమైనప్పటికీ, యుడిఎఫ్ మద్దతు ఇస్తున్న రాహుల్ పినరయిపై కేంద్ర దర్యాప్తు సంస్థలను అనవసరంగా ఉసి గొలుపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర దర్యాప్తు సంస్థలకి యుడిఎఫ్ అనుకూల వైఖరి ప్రదర్శిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి కాంగ్రెస్‌ను వామపక్షాలకు దూరం చేస్తోంది. ఇది కూటమిలో చీలికకు దారి తీయవచ్చున్న వ్యాఖ్యలు వస్తున్నాయి. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ దర్యాప్తులో ఇడికి వ్యతిరేకంగా మొదటిసారి ఆందోళన సాగినప్పుడు కాంగ్రెస్ పార్టీయే ముందున్నప్పటికీ, తరువాత వెనక్కు తగ్గింది. ఇప్పుడు కేరళలో అదే పరిస్థితి కనిపిస్తోంది. సిపిఐ అభ్యర్థి అన్నేరాజాపై కూడా రాహుల్‌కు మద్దతు ఇస్తున్న పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తుండడం, సిపిఐకి ఏం చేయాలో పాలుపోవడం లేదు. కూటమి లక్ష్యాలకు విరుద్ధంగా క్షేత్రస్థాయిలో కొన్ని చోట్ల కూటమిలోని పార్టీల పైనే వ్యతిరేక ప్రచారం సాగించడం కాంగ్రెస్ ద్వంద్వ రాజకీయ వైఖరిని చాటుతోంది. కేరళలో వటకర నియోజక వర్గ సిపిఎం అభ్యర్థిని కెకె శైలజకు మద్దతుగా ఇటీవల ప్రచారం సాగించిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కాంగ్రెస్ వైఖరిని తూర్పార బట్టారుకెకె శైలజపై సోషల్ మీడియాలో అసభ్యకరమైన ప్రచారం జరుగుతుండడం వెనుక కాంగ్రెస్ మిత్రపక్షమైన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ప్రోత్సాహం ఉంటోందని సిపిఎం ఆరోపిస్తోంది. దీనిపై ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. వాయినాడ్‌లో ఎల్‌డిఎఫ్ తరపున పోటీలో ఉన్న సిపిఐ అభ్యర్థిని అన్నేరాజాపై కూడా వ్యతిరేక ప్రచారం సాగుతోంది. ఈ వైఖరిని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా కూడా ఆక్షేపించారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్ డిమాండ్ చేయడాన్ని తప్పుపట్టారు. ఇండియా కూటమికి ఇంకా ప్రధాని అభ్యర్థి ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో రాహుల్‌ను ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమి నిర్ణయించాలనుకుంటే దానికి వామపక్షాలు అంగీకారం తెల్పకపోవచ్చు.

# వైసీపీకి టాలీవుడ్ రెడ్ ఫ్లాగ్

విజయవాడ, మే 10 వైసిపి పై తెలుగు చిత్ర పరిశ్రమలో తిరుగుబాటు ప్రారంభమైందా? ఎన్నికల్లో ప్రభావం చూపుతోందా? ఒక్కొక్కరు పవన్ కు మద్దతు తెలపడానికి అదే కారణమా? ఈ రెండు రోజుల్లో మరింత మంది ముందుకు వస్తారా? బాహటంగా మద్దతు ప్రకటిస్తారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పిఠాపురంలో పవన్ ను గెలిపించాలని చిరంజీవి ప్రత్యేక వీడియో ప్రకటించిన తర్వాత.. యువ హీరోలంతా పవన్ కు మద్దతు ప్రకటించారు. నాని, తేజ సజ్జా, రాజ్ తరుణ్ , సంపూర్ణేష్ బాబు ఇలా ఒక్కొక్కరు ప్రత్యేక ప్రకటనలు విడుదల చేశారు. ఇప్పుడు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ అయితే ఏకంగా వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. వైసీపీ శ్రేణులను ఉగ్రవాదులుగా పేర్కొన్నారు. అయితే చిత్ర పరిశ్రమ విషయంలో వైసీపీ సర్కార్ ఎన్ని రకాలు ఇబ్బందులు పెట్టాలో అంతలా పెట్టింది. ముఖ్యంగా టిక్కెట్ల ధర పెంపు విషయంలో అడ్డగోలుగా వ్యవహరించింది. వైసీపీ మంత్రులు అయితే స్థాయికి మించి స్పందించారు. మెగాస్టార్ లాంటి వ్యక్తులను సైతం అవమానపరిచారు. కొందరు సినీ పరిశ్రమ వ్యక్తులతో కలిసి చిరంజీవి జగన్ ను ఆశ్రయించారు. ఆ సమయంలో దొడ్డి దారిన ఫోటోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సినీ పరిశ్రమ కోసం చిరంజీవి జగన్ ను బతిమిలాడుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. సగటు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఆ వీడియోను చూసి చాలా బాధపడ్డాడు. అప్పటి నుంచే వైసీపీ సర్కార్ పై వ్యతిరేక భావన అలవర్చుకున్నారుగత ఎన్నికల్లో చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులు వైసీపీకి మద్దతు ప్రకటించారు. టిడిపి సానుభూతిపరులైన చిత్ర పరిశ్రమ ప్రముఖులు సైతం సైలెంట్ అయ్యారు. దానికి కారణం తెలంగాణలో కెసిఆర్ సర్కార్ అప్పట్లో అధికారంలో ఉండడమే. జగన్ కు అత్యంత సన్నిహితుడిగా మిగిలిన కేసీఆర్ నుంచి వచ్చిన ఆదేశాలతోనే చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులు వైసీపీకి అండగా నిలిచారు. అయితే నేడు ఆ పరిస్థితి లేదు. ప్రస్తుతం రేవంత్ అధికారంలో ఉండడంతో.. చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. ఏపీలో తమకు నచ్చిన రాజకీయ పార్టీలకు మద్దతు ప్రకటిస్తున్నారు. అందులో భాగంగానే నలుగురు కుర్ర హీరోలు పవన్ కళ్యాణ్ కు బాహటంగానే మద్దతు ప్రకటించగలిగారు. తాజాగా స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ తన మనసులో ఉన్న బాధను, అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చిత్ర పరిశ్రమలో పవన్ కళ్యాణ్ కు త్రివిక్రమ్ శ్రీనివాస్ అత్యంత సన్నిహితుడు. ఆయనతో సూపర్ డూపర్ హిట్ చిత్రాలను రూపొందించారు. అటు వ్యక్తిగతంగా కూడా పవన్ అంటే త్రివిక్రమ్ అభిమానిస్తారు. ఒకానొక దశలో ఆరాధిస్తానని చెప్పుకొచ్చారు. అటు పవన్ కళ్యాణ్ సైతం చిత్ర పరిశ్రమలో త్రివిక్రమ్ శ్రీనివాస్ తనకు అత్యంత ఆప్తుడని చెప్పుకొచ్చారు. అయితే పవన్ పై అభిమానంతో త్రివిక్రమ్ శ్రీనివాస్ జనసేన కోసం ఒక పాట రాశారు. అప్పటి నుంచి వైసీపీ టార్గెట్ చేసుకుంది. సోషల్ మీడియాలో త్రివిక్రమ్ పేరు, పర్సనల్ ఫోన్ నెంబర్ పెట్టడంతో.. ఆయనకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి 5000 కాల్స్ వచ్చినట్లు పేర్కొన్నారు. ఇలా ఫోన్ చేస్తున్నవారు తిట్ల దండకాన్ని, శాపనార్థాలు పెట్టినట్లు త్రివిక్రమ్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వైసీపీని ఓడించాలని త్రివిక్రమ్ శ్రీనివాస్ స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు. మొత్తానికైతే తెలుగు చిత్ర పరిశ్రమను వైసిపి చేజేతులా ప్రత్యర్థిగా మార్చుకుంటుంది. పోలింగ్ కు ముందు సినీ పరిశ్రమ పెద్దలు మరింత మంది ముందుకు వచ్చి తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే అవకాశం ఉంది. తాజాగా స్టైలిష్ స్టార్‌తాజాగా మెగా కాంపౌండ్ లో ఉండే స్టయిలిస్ట్ స్టార్ అల్లు అర్జున్ కూడా తన మామయ్యకు మద్దతుగా నిలిచారు. ప్రచారం చేయకపోయినా ఆయన తన మద్దతు పవన్ కల్యాణ్ కే అంటూ ఆయన ప్రకటించారు. స్టయిలిస్ట్ స్టార్ అల్లు అర్జున్ పవన్ కు మద్దతు ప్రకటించడంతో ఫ్యాన్స్ మరింతగా పవన్ కల్యాణ్ కు వెంట నడుస్తారని చెబుతున్నారు. అల్లు అర్జున్ ట్వీట్ చేస్తూ "మా ప్రేమ అభిమానం ఎప్పుడు మీతోనే ఉంటాయని అన్నారు. హీరో నాని కూడా పవన్ కు మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక పవన్ తో కలిసున్న ఫొటోను ట్విట్టర్ లో షేర్ చేసిన సంపూర్ణేష్ బాబు .. 'ఎన్ని అడ్డంకులు వచ్చినా .. ప్రజాపోరాటం నుంచి వెనక్కు తగ్గని మీ పోరాటపటిమ ఎప్పటికీ స్ఫూర్తి , రానున్న ఎన్నికలలో జనసేనానికి అన్ని శుభాలు జరగాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను సదా మీ ప్రేమకి బానిస. మీ సంపూర్ణేష్ బాబు' అని రాసుకొచ్చారు.

# ముద్రగడ తో లాభమా...నష్టమా

కాకినాడ, మే 10, ముద్రగడ పద్మనాభంతో వైసీపీకి లాభమా? నష్టమా? అన్న బలమైన చర్చ నడుస్తోంది. కేవలం కాపు సామాజిక వర్గం నుంచి జరిగే నష్టాన్ని నియంత్రించేందుకు ముద్రగడను వైసీపీలో చేర్చుకున్నారు జగన్. ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా పిఠాపురంలో వైసీపీ అభ్యర్థి వంగా గీత గెలుపునకు అవసరమైన వ్యూహాలను అమలు చేయాలని సూచించారు. కాపు సామాజిక వర్గాన్ని వైసీపీ వైపు టర్న్ అయ్యేలా చూడాలని కోరారు. అయితే ముద్రగడ వ్యవహరిస్తున్న తీరుతో పవన్ హైలెట్ అవుతున్నారు. కాపు సామాజిక వర్గం నేతగా, కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం కు మంచి పేరు ఉంది. అందుకే జగన్ సైతం వైసీపీలోకి రప్పించారు. ముద్రగడతో వైసీపీకి కాపు ఓట్లు మళ్ళించేలా ప్రయత్నం చేశారు. అయితే ముద్రగడ వ్యాఖ్యలు చూస్తే దారుణంగా ఉంటున్నాయి. పవన్ పిఠాపురంలో ఓడిపోకపోతే తన పేరు పద్మనాభ రెడ్డి గా మార్చుకుంటానని శపథం చేశారు. అయితే కుల ఉద్యమ నాయకుడిగా.. తన పేరు చివర తోకను.. మరో కులానికి జత చేయడం విమర్శలకు తావిచ్చింది. ఇప్పటికే జగన్మోహన్ రెడ్డికి అనుకూలంగా ఉండేందుకు కాపు ఉద్యమాన్ని తాకట్టు పెట్టారన్న విమర్శ ముద్రగడపై ఉంది. ఇప్పుడు అదే రెడ్డి పేరును.. తన పేరు చివరన పెట్టుకుంటానని చెప్పడం కొంచెం అతిగా మారింది. తన విషయంలో ముద్రగడ అనుచితంగా ప్రవర్తిస్తున్నా పవన్ మాత్రం.. ముద్రగడ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. జనసేనలో చేరేందుకు ముద్రగడ కుమార్తె, అల్లుడు ముందుకు వచ్చినప్పుడు పవన్ సున్నితంగా వారించారు. ముద్రగడను పల్లెత్తు మాట అనకుండా సహనాన్ని ప్రదర్శించారు.



ఆయన పెద్దరికాన్ని ప్రస్తావిస్తూ తనకున్న గౌరవ భావాన్ని ప్రదర్శించారు. ఆయనను ఇంటికి వెళ్లి మరీ కలుస్తానని చెప్పిన పవన్.. ఆయన తనను అనే మాటలను పెద్దగా తీసుకోనని.. ఇంట్లో పెద్దోళ్ళు ఒక మాట అంటే భరించలేమా? అంటూ చెప్పడం విశేషం. కాపు కులం ఓట్లను టార్గెట్ చేసే క్రమంలో.. తానే కాపులకు పెద్దగా తనకు తాను ఊహించుకుంటున్నారు ముద్రగడ. ఈ క్రమంలో అదే సామాజిక వర్గంలో డ్యామేజ్ అవుతున్నారు. వైసిపిని డ్యామేజ్ చేస్తున్నారు. అయితే పవన్ అలా హుందాగా ప్రవర్తించారో లేదో.. నీ ముగ్గురు భార్యలకు టిక్కెట్ ఇప్పిస్తానంటూ పవన్ పై మరోసారి విరుచుకుపడ్డారు ముద్రగడ. అయితే ముద్రగడ చేస్తున్న వ్యాఖ్యలతో వైసిపి కి డ్యామేజ్ అవుతోందని.. కాపు ఓట్లు కూటమి వైపు టర్న్ అవుతున్నాయని కాపు పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముద్రగడతో వైసీపీకి నష్టమని ఆ పార్టీకి చెందిన కాపు సామాజిక వర్గం అభ్యర్థులు చెబుతున్నారు. మొత్తానికైతే జగన్ ఇచ్చిన టాస్క్ ను తప్పుతున్నారు ముద్రగడ. తిరిగి ఆ పార్టీకే అంతులేని నష్టాన్ని చేకూరుస్తున్నారు. జూన్ 4 తర్వాత కానీ ముద్రగడ వ్యాఖ్యలతో ఏ స్థాయిలో డ్యామేజ్ జరిగిందో తెలియని పరిస్థితి. కనీసం ఈ రెండు రోజులపాటు అయినా ముద్రగడ నోటికి తాళం వేయాలని కాపు సామాజిక వర్గం అభ్యర్థులు కోరుతున్నారు.

# బాబాయ్, అబ్బాయ్ పట్టు నిలబెట్టుకుంటారా

శ్రీకాకుళం, మే 10, శ్రీకాకుళం జిల్లాలో కింజరాపు కుటుంబానిది సుదీర్ఘ రాజకీయ నేపథ్యం. దివంగత నేత ఎర్రం నాయుడు ఆ కుటుంబం నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. అయితే అంతకంటే ముందే ఎర్రం నాయుడు పెదనాన్న కృష్ణమూర్తి హరిశ్చంద్ర పురం ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టారు. టిడిపి ఆవిర్భావంతో ఎర్రం నాయుడు ఆ పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి కేంద్ర మంత్రి స్థాయికి చేరారు. తెలుగుదేశం పార్టీలో నెంబర్ 2 గా ఎదిగారు. ఎర్రం నాయుడు జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించడంతో.. ఆయన సోదరుడు అచ్చెనాయుడు ఆయన ఖాళీ చేసిన ఎమ్మెల్యే సీటుకు పోటీ చేసి గెలుపొందారు. ఎర్రన్న అకాల మరణంతో కుమారుడు రామ్మోహన్ నాయుడుపొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2014లో తొలిసారిగా ఎంపీ అయ్యారు. 2019లో జగన్ ప్రభంజనాన్ని తట్టుకొని బాబాయ్ టెక్కలి నుంచి అసెంబ్లీకి, అబ్బాయి శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇప్పుడు మరోసారి ఇద్దరు బరిలోకి దిగారు. అయితే వీరిద్దరిని ఓడించాలని జగన్ కృత నిశ్చయంతో ఉన్నారు. గట్టి అభ్యర్థులను బరిలోదించారు. సామాజిక సమీకరణలకు పెద్దపీటవేశారు. అచ్చన్నపై దువ్వాడ శ్రీనివాసును, రామ్మోహన్ నాయుడు పై పేరాడ తిలక్ ను ప్రయోగించారు. పక్కాగా వర్కౌట్ అవుతుందని భావించారు. దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్ ఒకే సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో.. కాళింగ సామాజిక వర్గం పోలరైజ్ అవుతుందని భావించారు. దీంతో టెక్కలి నుంచి పోటీ చేస్తున్న అచ్చన్న ఓటమి ఖాయమని ఒక నిర్ణయానికి వచ్చారు. కాళింగ సామాజిక వర్గమంతా ఏకమై వైసీపీకి మద్దతు తెలిపితే రామ్మోహన్ నాయుడు ఓడిపోతారని కూడా భావించారు. కానీ కాళింగులలో బలమైన చీలిక కనిపిస్తోంది. తెలుగుదేశం పార్టీ వైపు 50% కాలింగులు మొగ్గు చూపడంతో జగన్ ప్రయత్నానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. టెక్కలి నియోజకవర్గానికి చెందిన కేంద్ర మాజీ మంత్రి కృపారాణి కాళింగ సామాజిక వర్గానికి చెందినవారే. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో ఉన్న కృపారాణిని జగన్ వైసీపీలోకి ఆహ్వానించారు. సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవుల ప్రకటన సమయంలో కృపారాణి పేరు పరిగణలోకి తీసుకోవడం, తరువాత మరిచిపోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం నుంచి తనకు అవకాశం దక్కుతుందని కృపారాణి భావించారు. లేకుంటే టెక్కలి అసెంబ్లీ స్థానాన్ని అయినా కేటాయిస్తారని భావించారు. కానీపేరు పరిగణలోకి తీసుకోలేదు. తీవ్ర మనస్థాపానికి గురైన కృపారాణి టిడిపిలో చేరతారని ప్రచారం జరిగింది. కానీ కాంగ్రెస్ పార్టీలో చేరి.. కాళింగ సామాజిక వర్గ ఓట్లు చీల్చాలని ఆమె బలంగా నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు గాను.. అన్ని నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయి. శ్రీకాకుళం, పాతపట్నం నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులకు ఇవ్వడంతో మాజీ ఎమ్మెల్యేలు అసంతృప్తి స్వరం వినిపించారు. కానీకొద్ది రోజులకే మెత్తబడ్డారు. అక్కడ పరిస్థితి చల్లబడింది. టిడిపి క్యాడర్ సైతం బలంగా పనిచేస్తోంది. దీంతో ఎంపీ రామ్మోహన్ నాయుడుకే ఎడ్జ్ కనిపిస్తోంది. టెక్కలిలో సైతం అచ్చన్న బలమైన స్థితిలో ఉన్నారు. దువ్వాడ శ్రీనివాస్ కు సొంత పార్టీ నుంచే ఆశించిన స్థాయిలో సహకారం అందడం లేదు. ఆయన భార్య సైతం దువ్వాడ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారు. అయితే ఈసారి కూడా బాబాయి,అబ్బాయి గెలుపు ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. అటు సర్వేలు కూడా గెలుపు ఖాయమని స్పష్టం చేస్తున్నాయి. అయితే ప్రజల మదిలో ఏముందో జూన్ 4న తెలియనుంది.

## గంటల్లో ముగియనున్న ప్రచారం..ఓట్ల వేటలో ప్రధాన పార్టీలు


సార్వత్రిక సమరం (2024) తుది దశకు చేరుకుంది. ఈనెల 11వ తేదీతో ప్రచారం ముగియనుంది. ప్రజారానికి ఇంకా కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండటంతోఅభ్యర్థులు 'సమయం లేదు మిత్రమా' అంటూ శ్రేణులను ఓటర్ల చెంతకు పరుగులు పెట్టిస్తున్నారు. పాంప్లెట్లు, న్యూస్ పేపర్లు,బ్రోచర్లు వంటి ప్రచారాలతో పాటు, సోషల్ మీడియా డిజిటల్ మీడియాని విస్తృతంగా ప్రచారానికి వినియోగిస్తున్నారు. డిజిటల్ స్క్రీన్ లతో వాహనాలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. ఐ వి ఆర్ ఎఫ్ కాల్స్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. నాయకులు తమవంతు ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. ఇంటింటికి తిరుగుతూ ఆఖరి ఓటును కూడా తమకే వేయాలని అభ్యర్థిస్తున్నారు. ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను ఇప్పటికే సేకరించిన నాయకులు వారిని రప్పించి ఓటు బలాన్ని పెంచుకోవాలని భావిస్తున్నారు. ఇప్పటికే గ్రామానికి ఇద్దరు చొప్పున బాధ్యులను నియమించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పడిన ఓట్ల ఆధారంగా, ఆయా ప్రాంతాలపై ప్రధాన పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఓటర్లు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి ఒక్కో ఓటరుకు ప్రత్యేకంగా సమయమిచ్చి తమవైపు తిప్పుకునే విధంగా చేయాలని గ్రామస్థాయి నేతలను ఆదేశిస్తున్నారు.

# తిరుపతిలో జనసేనకు మైనస్

తిరుపతి, మే 10,జనసేన పార్టీ ప్రస్తుత ఎన్నికల్లో 21 స్థానాల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం పరిస్తితిని పక్కన పెడితే.. 20 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములు ఎలా ఉన్నా యనేది ఆసక్తిగా మారింది. ఇతర నియోజకవర్గాల్లో ముఖ్యంగా ఫస్ట్ ఓడిపోయే సీటు ఇదే నంటూ.. సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ సీటును జనసేనకు ఇచ్చి టీడీపీ కూడా తప్పు చేసిందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. అదే.. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం. జాతీయ, రాష్ట్ర స్థాయి.. స్థానిక స్థాయిలో ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతికి ఎంతటి విశిష్టత ఉందో చెప్పక్కర్లేదు. వైసీపీ నుంచి వచ్చిన నేతకు సీటు ఇవ్వడమే అది పెద్ద తప్పుగా కూటమిలోని పార్టీ నేతలు చెబుతున్నారు. అయితే ఇక్కడ జనసేన పోటీ చేస్తుండడంతో ఎవరు గెలుస్తారన్న దానిపై చాలా సర్వేలు నడుస్తున్నాయి. వాటిలో చాలా సర్వేలు జనసేనకు అనుకూలంగా వస్తున్నాయి. తిరుపతి అసెంబ్లీ పరిధిలోని తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్ మండలాలను తీసుకుంటే.. గత ఎన్నికల వరకు కూడా..తిరుపతి రూరల్ పరిధిలో టీడీపీకి బలమైన కేడర్ ఉంది. ఇదే ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచింది. అలాంటి రూరల్ మండలాల్లోనూ.. వైసీపీ మాటే వినిపిస్తుండటం.. ముఖ్యంగా భూమన అభినయ్ రెడ్డి గురించి పాజిటివ్ టాక్ రావడం గమనార్హం. ఇక, తిరుపతి అర్బన్ లో ఎలానూ.. భూమన కుటుంబానికి మంచి పట్టుంది. ఇక్కడ ఆయనకే ప్రజలు జేజేలు పలుకుతున్న పరిస్థితి కనిపిస్తోంది.కానీ, ఎటొచ్చీ.. బీజేపీకి అంతో ఇంతో మద్దతు ఉన్న అర్బన్ ప్రాంతంనూ ఇక్కడి ప్రజల్లో బీజేపీ మాట వినిపించడంలేదు. జనసేన మాట కూడా.. వినిపించడం లేదు. దీనికి కారణం.. జనసేన తరఫున ఎక్కడో చిత్తూరు నుంచి తీసుకువచ్చిన ఆరణి శ్రీనివాసులకు.. టికెట్ ఇవ్వడం.. ఇచ్చే ముందు.. కనీసం తమతో చర్చించలేదన్న వాదన వినిపిస్తుండడం వంటివి పెద్ద మైనస్ అయింది. ఇక, పవన్ నేరుగా రంగంలోకి దిగి బుజ్జగించినా.. ఆ తరహా కలివిడి అయితే.. నేతల మధ్య కనిపించడం లేదు. జెండాలు పట్టుకుని తిరుగుతున్నప్పటికీ కనీసం వారి కుటుంబ సభ్యులకు కూడా జనసేన అభ్యర్థికి ఓటు వేయాలని చెప్పకపోవడం ఈనేతల స్పెషాలిటీ.. అంటే పార్టీలో ఉంటూనే జనసేన అభ్యర్థికి సహాయ నిరాకరణ చేస్తున్నట్లే కనిపిస్తుంది. అటు టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మతో పాటు ఇతర నేతలు కూడా అంటీముట్ట నట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇది జనసేనకు తొలి ఎదురు దెబ్బ. అంతేకాదు.. కూటమి పార్టీల ఓట్లు కూడా.. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులకు బదిలీ అయ్యే అవకాశం పరిస్థితి కనిపించడం లేదు. మొత్తంగా చూస్తే.. జనసేన ఓడిపోయే తొలి స్థానం తిరుపతేనని... అసలు జనసేన ఈ సీటే గెలిస్తే ఆ పార్టీకి 21కు 18 సీట్లు పక్కాయే అంటున్నారు. దీంతో ఇది చూసిన తర్వాతనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలసి తిరుపతిలో రోడ్ షో చేశారు. సభను నిర్వహించారు. అయినా పరిస్థితిలో మాత్రం మార్పు లేదంటున్నారు.

# సెంటిమెంట్ నమ్ముకున్న షర్మిల

కడప, మే 10, మన ఇంటికి న్యాయం కోసం వచ్చిన ఆడబిడ్డతో రాజకీయం ఏందిరా?' మొన్న ఆ మధ్యన యాత్ర సినిమాలో వైయస్ రాజశేఖర్ రెడ్డి పాత్రధారి మమ్ముట్టి పలికే డైలాగ్ ఇది. ఎంతో ప్రాచుర్యం పొందింది ఈ డైలాగ్. అయితే రాయలసీమకు ఈ డైలాగ్ దగ్గరగా ఉంటుందన్నది ఒక వాదన. ఇప్పుడు అదే వాదన వినిపిస్తున్నారు వైఎస్ షర్మిల. కాంగ్రెస్ పగ్గాలు తీసుకున్న ఆమె కడప ఎంపీగా పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. సోదరుడు జగన్ పై గట్టి ఫైట్ చేస్తున్నారు. అయితే తన శక్తి యుక్తులన్నింటినీ ప్రదర్శిస్తున్నారు. చివరకు సెంటిమెంట్ అస్త్రాలను సైతం వదులుతున్నారు. అది కడప ప్రజలకు ఎంతవరకు ప్రభావితం చేస్తాయో చూడాలి. కడప ఎంపీగా గెలిచి తన రాజకీయ భవిష్యత్తుకు పునాది వేయాలని షర్మిల భావిస్తున్నారు. ప్రధానంగా వైఎస్ వివేకానంద రెడ్డి హత్య అంశంపై మాట్లాడుతున్నారు. కడప ప్రజలతో మమేకమయ్యే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు కొంగు చాచి అడుగుతున్నాను న్యాయం చేయండి.. మీ ఆడబిడ్డలం అడుగుతున్నాం న్యాయం చేయండి.. మీ వైయస్సార్ బిడ్డలం అడుగుతున్నాం న్యాయం చేయండి అంటూ సెంటిమెంట్ అస్త్రాలను సంధిస్తున్నారు. ఇవి విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. రాయలసీమలో ఆడబిడ్డది ప్రత్యేక స్థానం. పుట్టింటిని వెతుక్కుంటూ వెళ్లే మహిళకు ఎనలేని ప్రాధాన్యమిస్తారు. తోబుట్టువుగా చూసుకుని శక్తి కొలదిసాయం చేస్తారు. ఇప్పుడు దానినే గుర్తు చేస్తున్నారు షర్మిల. తోడబుట్టిన అన్న తమకు అన్యాయం చేశాడని.. ప్రజలే సోదరులుగా మారి తనకు న్యాయం చేయాలని కోరుతున్నారు. కడప వేదికగాకుటుంబ సభ్యుల మధ్య జరుగుతున్న రాజకీయం పతాక స్థాయికి చేరుకుంది. సోదరుడుతో విభేదించిన షర్మిలకు కాంగ్రెస్ పగ్గాలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపడానికి షర్మిల గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కడప రాజకీయాలు దడ పుట్టిస్తున్నాయి. కడప నుంచే తేల్చుకోవాలని షర్మిల గట్టిగానే డిసైడ్ అయ్యారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అటు పులివెందులలో సైతం సోదరుడికి చికాకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ప్రచారమే అన్నది కనిపించని పులివెందులలో.. తన గెలుపు బాధ్యతను అర్ధాంగి భారతికి అప్పగించారు జగన్. కడపలో వైసిపి దూకుడుకు చెక్ చెప్పాలని షర్మిల భావిస్తున్నారు. పులివెందులలో సైతం అన్నకు గట్టిగానే బదులిస్తున్నారు. దీంతో భారతి పులివెందులలో క్షణం తీరిక లేకుండా గడపాల్సి వస్తుంది. ఒకవైపు భారతి, మరోవైపు షర్మిల పోటీ పడి ప్రచారం చేస్తున్నారు. ఒకరి వ్యాఖ్యలపై ఒకరు గట్టిగానే రిప్లై ఇస్తున్నారు. ఓ ఇంటర్వ్యూలో వైయస్ భారతి ఏపీలో వైసీపీ నే సింగిల్ ప్లేయర్ అంటూ



చెప్పుకొచ్చారు. దీనికి కౌంటర్ ఇచ్చారు షర్మిల. గొడ్డలితో వివేకానంద రెడ్డిని నరికేసినట్టు.. మిగతా వాళ్ళను కూడా నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్ అంటూ షర్మిల విరుచుకుపడ్డారు. అదే సమయంలో కడప వైసీపీ అభ్యర్థి అవినాష్ రెడ్డిపై సైతం తీవ్ర వ్యాఖ్యలు చేశారు షర్మిల. ఓటమితో అవినాష్ రెడ్డి ఊరు దాటేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. దీనికోసం పాస్పోర్ట్ కూడా సిద్ధం చేసుకున్నారని చెప్పుకొచ్చారు. మొత్తానికైతే ఒక వ్యూహం ప్రకారం వైయస్ భారతి తో పాటు అవినాష్ రెడ్డి పై విమర్శలతో దూసుకెళున్నారు షర్మిల. అయితే దీనిపై వైసీపీ సోషల్ మీడియా భిన్నంగా స్పందిస్తోంది. రాయలసీమలోఅన్నను మోసం చెల్లెలు లేదని.. అన్నను విలన్ గా చూపే చెల్లి లేదని.. అన్నను దెబ్బతీయాలని ప్రత్యర్థులతో చేతులు కలిపి చెల్లి లేదని.. చెబుతూ వైసిపి సోషల్ మీడియా ప్రచారం చేస్తోంది. అయితే ఒకపక్క షర్మిల సెంటిమెంట్ అస్త్రం.. మరోవైపు వైసీపీ తిప్పికొట్టే వ్యూహం.. మరి ఇందులో ఎవరు సక్సెస్ అవుతారో చూడాలి.

# ల్యాండ్ టైటిల్ యాక్ట్ కి ఎఫెక్ట్

## జగన్ ఫోటోల పిచ్చే కారణం

రాజమండ్రి, మే 10, ఏపీలో జగన్ చేజేతులా నష్టాన్ని తెచ్చుకున్నారు. ఫోటోల పిచ్చితో ఎన్నికల ముంగిట విపక్షాలకు ప్రచార అస్త్రాలను అందించారు. అటు న్యాయవాదులు సైతం అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో ఈ అంశం వైరల్ అయింది. ప్రజల భూములను ప్రభుత్వం లాక్కునే ప్రయత్నం చేస్తున్న ఆరోపణ బలంగా వెళ్తోంది. సీఎం జగన్ కు ఎవరు సలహా ఇచ్చారో? ఎవరు చెప్పారో తెలియదుకానీ.. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తన ఫోటోలు ఉండాలని భావించారు. పార్టీ రంగులు వేసుకోవాలని చూశారు. అయితే మహిళలకు ఇచ్చే పథకాల నుంచి.. పింఛన్ పుస్తకాల వరకు.. అన్నింటి పైన సీఎం జగన్ బొమ్మ ఉండి తీరాల్సిందే అన్న పంథాను కొనసాగించారు. రంగులు, ఫోటోల విషయంలో ఎప్పటికప్పుడు జగన్ కు చుక్కెదురవుతూ వచ్చింది. ఎన్నికల ముంగిట పట్టాదారు పాసు పుస్తకం పై జగన్ ఫోటో చాలా నష్టం కలిగిస్తోంది.మొన్న ఆ మధ్యన భూ సర్వే కు సంబంధించి కొనుగోలు చేసిన సరిహద్దురాళ్లపై కూడా జగన్ ఫోటో వేశారు. ఏకంగా రాయిపై చిత్తరువులు వేయించారు. పొలానికి వెళ్లే రైతుకు జగనే కనిపిస్తారన్నది ఒక ఆరాటం. దీంతో చేసిన మేలు రైతులు గుర్తుపెట్టుకుంటారని భావించారు. అటు ప్రతి ఇంటా స్టిక్కర్ కూడా అతికించారు. మా నమ్మకం నువ్వే జగన్ అంటూ చెప్పుకునే ప్రయత్నం చేశారు.అయితే ఇంతవరకు ఓకే కానీ.. తమ ఆస్తి పత్రాలపై జగన్ ఫోటోను వేయడాన్ని మాత్రం ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. అదే పనిగా విపక్షాలు లేవనెత్తుతుండడంతో రైతులు, ప్రజల్లో ఆందోళన కనిపిస్తోంది.ఇప్పుడు ఏపీలో ఎక్కడ విన్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి వినిపిస్తోంది. భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటుందన్నది చర్చకు దారితీస్తోంది. గతంలో ఏ ప్రభుత్వము ఇటువంటి సాహసం చేయకపోవడం.. జగన్ దానిని టచ్ చేయడం వివాదంగా మారింది. మీ ఆస్తులు దోచేసేందుకు ప్లాన్ చేసుకున్నారు. మీ ఆస్తులపై మీ ఫోటోలు కాకుండా.. జగన్ ఫోటోలు వేసుకున్నాడు అంటే అర్థం అదే.. అంటూ చంద్రబాబు, పవన్ లు విరుచుకుపడుతున్నారు. విపక్షాల నుంచి ఎదురవుతున్నఅభ్యంతరాలు ప్రశ్నలకు అధికార పక్షం నుంచి సమాధానం లేకుండా పోతోంది. ఆ ప్రచారాన్ని తిప్పి కొట్టలేక చేతులు ముడుచుకోవాల్సిన పరిస్థితి వైసీపీకి దాపురించింది.ఇప్పటివరకు ఉన్న సంక్షేమ వాదన, మీ బిడ్డ అనే వాదనలు పక్కకు వెళ్లిపోయాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఫోటోల రాజకీయం ఇప్పుడు ఏపీలో రంజుగా మారింది. జగన్ కు ఎనలేని నష్టం చేకూర్చేలా మారింది. మీ బిడ్డ మీ బిడ్డ అన్నాడు కాబట్టే.. మీ ఆస్తి తీసుకుంటాడు అంటూ.. అందులో తప్పేముందంటూ మీమ్స్ వైరల్ అవుతున్నాయి.

# రాధాకు ఎమ్మెల్సీ పదవి...

విజయవాడ, మే 10,ఒక్కోసారి రాజకీయంగా తప్పుడు నిర్ణయాలు అధికారాన్ని దూరం చేస్తాయి. అవకాశాలను తొక్కి పెడతాయి. ఈ కోవలోకి చెందుతారు వంగవీటి రాధాకృష్ణ. దివంగత వంగవీటి మోహన్ రంగ కుమారుడిగా రాజకీయాల్లో ప్రవేశించారు రాధాకృష్ణ. కానీ తన రాజకీయ జీవితంలో కీలక నిర్ణయాల సమయంలో తప్పటడుగులు వేశారు. దానికి మూల్యం చెల్లించుకున్నారు. తరచూ పార్టీలు మారుతారన్న అపవాదును మూటగట్టుకున్నారు. అందుకే ఈసారి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేస్తున్నారు. ఒకవేళ కూటమి అధికారంలోకి వస్తేరాధాకు కీలక పదవి తప్పదన్న సంకేతాలు చంద్రబాబు ఇచ్చారు.1988లో వంగవీటి మోహన్ రంగ హత్యకు గురయ్యారు. 1989 ఎన్నికల్లో ఆయన భార్య రత్నకుమారి విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ 1994 తర్వాత ఆ కుటుంబం రాజకీయంగా తెర మరుగైంది. కానీ 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి రాధాను ప్రోత్సహించారు. విజయవాడ తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్ ఇచ్చి గెలిపించారు. 26 ఏళ్ల వయసులోనే రాధాకు అరుదైన గౌరవం లభించింది. కానీ 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరారు రాధా. నియోజకవర్గాల పునర్విభజన తో ఏర్పడిన విజయవాడ సెంట్రల్ కు మారారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లాది విష్ణు చేతిలో ఓడిపోయారు. 2014 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. మరోసారి తూర్పు నియోజకవర్గం నుంచి పోటీచేసి టిడిపి అభ్యర్థి గద్దె రామ్మోహన్ చేతిలో ఓడిపోయారు. 2019ఎన్నికల్లో సెంట్రల్ నియోజకవర్గం కోసం పట్టుపట్టారు. దక్కకపోయేసరికి టిడిపిలో చేరారు. టిడిపికి స్టార్ క్యాంపెయినర్ గా ప్రచారం చేశారు. పార్టీ ఓటమి చవిచూసేసరికి గత ఐదేళ్లుగా సైలెంట్ అయ్యారు.ఈ ఎన్నికల్లో కూడా రాధాకు టిడిపి సీటు సర్దుబాటు చేయలేదు. దీంతో రాధా వైసీపీలో చేరతారని ఒకసారి, జనసేనలో చేరతారని మరోసారి ప్రచారం జరిగింది. కానీ రాధా నిబ్బరంగానే ఉన్నారు. ప్రస్తుతం టిడిపి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట దెందులూరు లో చింతమనేని ప్రభాకర్ తరపున ప్రచారం చేశారు. ఆ సమయంలోనే చంద్రబాబు రాధాకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. రాధాకు మంచి భవిష్యత్తు ఇస్తానని కూడా తేల్చి చెప్పారు. ప్రస్తుతం రాధ విజయవాడ పార్లమెంట్ స్థానం పరిధిలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు. విజయవాడ తూర్పు, పశ్చిమ అభ్యర్థులకు మద్దతుగా ఇటీవల ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం.. రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇస్తారని.. క్యాబినెట్లో సైతం తీసుకుంటారని సన్నిహితులు చెబుతున్నారు. అయితే గతానికి భిన్నంగా రాధా.. నిబ్బరంగా ఒకే పార్టీలో ఉండడం విశేషం.

# అగ్నిప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం

అంబేద్కర్ కోనసీమ ఆలమూరు మండలం మడికి శివారు నాగులపేటలో శుక్రవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. వారి వివరాలు ప్రకారం గొంపా మాలిబాబు కొండమ్మ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో తాటాకు ఇంటిలో నివాసం ఉంటుండగా శుక్రవారం ఉదయం విద్యుత్ వైర్ల నుండి ఏర్పడిన మంటలతో ఇల్లు ఒక్కసారిగా అంటుకుని కాలిబూడిద అయినట్లు తెలిపారు. ఇంటిలో ఉన్న వంట సామాగ్రి, దుస్తులు, సైకిళ్ళు, ద్విచక్ర వాహనంతో పాటు అన్ని కాలి బూడిద అవ్వడంతో సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించినట్లు వారు తెలిపారు. మంటలు పక్క గృహాలకు వ్యాప్తి చెందకుండా స్థానికులు ఆపారు. కట్టు బట్టలతో మిగిలిన వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు తెలిపారు.

# చివరి అస్త్రాలతో నేతలు

ఒంగోలు, మే 10, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలకు ఇంకా 2 రోజులు మాత్రమే సమయం ఉంది. అన్ని రాజకీయ పార్టీలూ అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తున్నాయి. అధికార వైసీపీ నేతలు మరింత స్పీడ్ తో ఇప్పటికే వాలంటీర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో చివరి మూడు రోజులు అత్యంత కీలకం. ఎలక్షనీరింగ్ అనేది ఈ మూడు రోజుల్లోనే జరుగుతుంది. తమకు పడే ఓట్లను గుర్తించి ఆ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చేంత వరకూ అన్ని రాజకీయ పార్టీలకు కత్తిమీద సాము వంటిదే. ఎందుకంటే పోలింగ్ రోజున తమకు ఖచ్చితంగా ఓట్లు పడతాయని భావించిన వాళ్లు రాకుంటే అది ఆ పార్టీకి నష్టం చేయడంతో పాటు ప్రత్యర్థి పార్టీకి నష్టం చేకూరుస్తుంది. అందుకే ఈ మూడు రోజులు ఏపీ ఎన్నికల్లో కీలకంగా మారనుంది.ఒక్కొక్క వాలంటీర్ కు యాభై ఇళ్లు కొట్టిన పిండి కావడంతో నియోజకవర్గంలో నేతలందరూ వాలంటీర్లతో ప్రత్యేకంగా సమావేశం కావాలని ఇప్పటికే పార్టీ అధినాయకత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యే అభ్యర్థులు వాలంటీర్లు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేస్తున్నారు. వాలంటీర్లకు వైసీపీ నేతలు పెద్దమొత్తంలో డబ్బులు కూడా పంచుతున్నట్లు వార్తలు అందుతున్నాయి. లక్ష రూపాయలకు పైగా నగదుతో పాటు ఉత్తరాంధ్రలో ఒక నియోజకవర్గంలో అయితే వాలంటీర్లకు ఖరీదైన సెల్ ఫోన్లను కూడా బహుమతిగా ఇస్తున్నట్లు సమాచారం అందుతుంది. వాలంటీర్లు వైసీపీకి ఓటు వేసే వారిని గుర్తించి వారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకు వచ్చే బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది.ఇప్పటికే సగం మందికి పైగా వాలంటీర్లు తమ పదవులకు రాజీనామాలు చేశారు. కానీ వారికి ఉన్న పరిచయాలను ఈ ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు వైసీపీ సిద్ధమయింది. నేతలు ఒకవైపు ప్రచారం చేసుకుంటుండగానే వాలంటీర్లు ఇంటింటికీ తిరిగి జగన్ పార్టీ గెలిస్తేనే పథకాలు అమలవుతాయని, చంద్రబాబు వస్తే లబ్దిదారుల్లో కోత తప్పదని, అందులో మీరు ఉండరన్న గ్యారంటీ ఉండదని కొందరు బెదరగొడుతున్నారు. కోస్తా జిల్లాలోని ఒక కీలకమైన నియోజకవర్గంలో అయితే వాలంటీర్లకు ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసి ఇస్తామని హామీ ఇస్తున్నట్లు సమాచారం. అంత పెద్ద స్థాయిలో వైసీపీ ఈ ఎన్నికలను ఛాలెంజ్ గా తీసుకుందో దీనిని బట్టి అర్థమవుతుంది. తాము గెలిచిన వెంటనే మోటార్ బైక్ లు మీ ముందుంటాయని కూడా వాలంటీర్లను మభ్యపెడుతున్నారు. చివరి మూడు రోజుల్లోనే ఓటర్లను ఏ రాజకీయ పార్టీ అయినా ఆకట్టుకునే అవకాశముంది. అందుకే ఈరోజు నుంచే వాలంటీర్లతో పాటు ముఖ్య అనుచరులను కలిపి ఒక టీంగా ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు కలసి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావాల్సి ఉంటుంది. వారి చేత ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాల్సి ఉంటుంది. వారికి అవసరమైన నగదు కూడా వీరిద్వారానే పంపిణీ చేస్తున్నారని సమాచారం. ఓటర్లు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున కొన్ని నియోజకవర్గాల్లో ఇస్తున్నట్లు తెలిసింది. ఉభయ గోదావరి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఇంట్లో ఎన్ని ఓట్లున్నా సరే ఓటుకు మూడు వేల రూపాయల చొప్పున పంచుతున్నారని తెలిసింది.

# గరం..గరంగా గుంటూరు



గుంటూరు, మే 10, అమరావతి రాజధాని విస్తరించి ఉన్న గుంటూరు జిల్లా రాజకీయం రసవత్తరంగా తయారైంది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎత్తులపై ఎత్తులతో అక్కడి పొలిటిక్స్ ఉత్కంఠభరితంగా మారాయి. తమకు అనుకూలమైన వర్గాలను మరింత ఆకట్టుకోవడానికి కేండెట్లు తెగ ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో వృత్తిపరంగా ఒక వర్గీయులు మాత్రం అభ్యర్థులంతా తమవారే ఎవరి పక్షాన నిలవాలి అని ఆలోచనలో పడ్డారంట. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నికల ప్రచారాలు జోరుగా సాగుతున్నాయి. మొత్తం 17 నియోజకవర్గాల్లో అభ్యర్థులు తమ గెలుపు కోసం అహోర్నిశలు కృషి చేస్తున్నారు. ప్రజలను ఆకట్టుకోవటానికి తమ పార్టీ మేనిఫెస్టోతో పాటు అనేక అంశాలు ప్రస్తావిస్తూ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. అందులో భాగంగా ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేసి తాము గెలిస్తే ఒనగూరే ప్రయోజనాలపై వివరిస్తున్నారు. జిల్లాలో మెడికల్ ఫీల్డ్‌కి చెందిన అభ్యర్థులు పలువురు పోటీ పడుతున్నారు. గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఎన్ఆర్ఐ డాక్టర్ గుంటూరు వెస్ట్ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి వికాస్ హాస్పటల్స్ డైరెక్టర్.. గుంటూరు వెస్ట్ వైసీపీ కేండెట్ విడుదల రజినీ ప్రస్తుతం ఏపీ హెల్త్ మినిస్టర్ ..చిలకలూరిపేట నుంచి షిఫ్ట్ అయి వచ్చిన మంత్రి రజనీ గుంటూరు వెస్ట్ అభ్యర్థినిగా పోటీలో ఉండటంతో ఆ సెగ్మెంట్ అందరి ద?ష్టినీ ఆకర్షిస్తుంది.. వైద్య సేవలకు పెట్టింది పేరైన అక్కడ పోటీలో ఉన్న అభ్యర్థులు ముగ్గురూ మెడికల్ ఫీల్డ్ కు సంబంధించిన వారు అవ్వడంతో ఆ రంగం వారు ఎవరివైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది.. ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులు ప్రకటించి యావత్తు దేశం దృష్టి తనవైపు తిప్పుకున్న పెమ్మసాని చంద్రశేఖర్ ప్రచారంలో స్పీడ్ పెంచుతున్నారు. డాక్టర్లతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో వారిని ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ప్రజల్లో ప్రచారం చేస్తున్న సమయంలో కూడా వైసీపీ ప్రభుత్వ విధానాలపై ఆయన అదే దూకుడు ప్రదర్శిస్తున్నారు.తాను గుంటూరు ఎంపీగా గెలిస్తే తప్పకుండా డాక్టర్స్‌కు సంబంధించి సమస్యల పరిష్కారానికి పెమ్మసాని హామీ ఇచ్చారు. వికాస్ హాస్పిటల్ డైరెక్టర్ అయిన గల్లా మాధవికి కూడా మెడికల్ ఫీల్డ్‌లో విస్తృత పరిచయాలున్నాయి. ఆమె కూడా వైద్యులతో ప్రత్యేకంగా భేటీ అవుతూ టీడీపీకి అనుకూలంగా పనిచేయమని కోరుతున్నారు. ప్రస్తుతం ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న విడుదల రజనీ మెడికల్ ఫీల్డ్‌లో తనకున్న పరిచయాలను ఉపయోగించుకోవడానికి తెగ ప్రయత్నిస్తున్నారు. వారందరితో రజనీ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి తనకు సహకరించాలని కోరుతున్నారు.ఆ ముగ్గూరు తమ రంగానికి సంబంధించిన వారే కావడంతో ఎవరి వైపు నిలబడాలో తెలియక వైద్యరంగ ప్రముఖులు ఆలోచనలో పడుతున్నారంట. ఇక జిల్లాలోని నరసరావుపేటు అసెంబ్లీ సెగ్మెంట్ బరిలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ డాక్టర్లే .. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రముఖ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మరో సారి పోటీలో ఉన్నారు. అదేవిధంగా టిడిపి నుంచి బరిలో ఉన్న చదలవాడ అరవింద్‌బాబుకు వైద్యుడిగా నరసరావుపేటలో మంచి పేరుంది.2019 ఎన్నికల్లో తొలిసారి ఎన్నికల బరిలో దిగిన డాక్టర్ చదలవాడ. వైసీపీ నుంచి పోటీ చేసిన సహచర డాక్టర్ గోపిరెడ్డి చేతిలో పరాజయం పాలయ్యారు. ప్రస్తుతం హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన గోపిరెడ్డి శ్రీనివాస్ వైద్యుడిగా తనకున్న పరిచయాలతో ప్రచారం చేసుకుంటున్నారు. గత ఎన్నికల్లో పరాజయం పాలైన చదలవాడకు ఈ సారి ఆ సానుభూతి పనిచేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరి ఈ వైద్యరంగ ప్రముఖుల్లో ఎవరు ఓటరు నాడిని ఒడిసి పట్టుకుంటారో చూడాలి.

# 23 లక్షల నగదు స్వాధీనం

ఒంగోలు,ప్రచార పర్వం మరో రెండు రోజుల్లో ముగియనుండటంతో నియోజకవర్గం లో పోలీసుల నిఘానీడలు అలముకున్నాయి. ఓటుకు నోటును అరికట్టేందుకు పోలీసులు వేట షురూ అయింది. ఎన్నికల నిబంధనావళిలో భాగంగా వేటపాలెం మండలం కఠారిపాలెంలో పోలీసులు మరియు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం సంయుక్తంగా కార్డ్ అండ్ సెర్చ్ చేపట్టారు. విషయం తెలుసుకున్న పామంచి నర్సింహారావు అనే వ్యక్తి తన ఇంట్లో ఉన్న నగదు తో బైక్ పై పొట్టిసుబ్బయ్యపాలెం వెళ్ళుతున్న సమయం లో పోలీసులు అతని విచారించగా అతని వద్ద సుమారు 23 లక్షల రూపాయలు నగదు ఉన్నట్లు గుర్తించారు.అతని వద్ద నుండి ఆ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న 22 లక్షల 95 వేల రూపాయల నగదు ను ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో సీజ్ చేసి జిల్లా ఎన్నికల అధికారికి పంపించడం జరుగుతుందని సిఐ సత్యన్నారాయణ తెలిపారు.సీజ్ చేసిన నగదు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ కు చెందినవిగా పోలీసులు భావిస్తున్నారు

# కేసులు బలవంతంగా పెట్టిస్తున్నారు

బెంగళూరు, మే 10,కర్ణాటక జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల కేసులో కొత్త ట్విస్ట్ తెరపైకి వచ్చింది. ప్రజ్వల్ రేవణ్ణపై ఫిర్యాదు చేసిన మహిళల్లో ఒకరు.. తనను కొందరు వ్యక్తులు బలవంతంగా ఫిర్యాదు చేయమని చెప్పారని చెప్పినట్లు జాతీయ మహిళా కమిషన్ పేర్కొంది. వారి బెదిరింపుల కారణంగానే తాను పోలీసులకు ప్రజ్వల్ రేవణ్ణపై తప్పుడు ఫిర్యాదు చేసినట్లు సదరు మహిళ తెలిపిందని ఔఅచి వెల్లడించింది.దీనిపై కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ రాష్ట్ర ప్రెసిడెంట్ హెచ్ డీ కుమారస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అనుకూలంగా ప్రకటనలు చేయకపోతే.. వారిపై వ్యభిచారం కేసులు పెడతామని సిట్ అధికారులు బాధితులను బెదిరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏకంగా బాధితుల ఇంటికి వెళ్లి.. తప్పు వ్యభిచారం కే?లు పెడతామని బెదిరించడం వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు.తాను ప్రజ్వల్ రేవణ్ణను సమర్థించడం లేదని చెబుతూనే.. ఈ కేసును ప్రపంచంలోనే అతిపెద్ద లైంగిక వేధింపుల కేసుగా చెప్పిన రెవెన్యూ మంత్రి కృష్ణ బైరె గౌడపై ప్రశ్నల వర్షం కురిపించారు. కిడ్నాపైన మహిళలను కాపాడి ఎక్కడ దాచారు ? ఎందుకు కోర్టులో ప్రవేశ పెట్టడం లేదు? ఈ వీడియోలను వైరల్ చేయడాన్ని సమర్థిస్తున్నారా ? అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ చట్టాని గౌరవించాలని, దోషులకు కచ్చితంగా శిక్షపడాలని తెలిపారు.మరోవైపు సిట్ చేస్తున్న దర్యాప్తును కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర సమర్థించారు. జేడీఎస్ చేస్తున్న అన్ని ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంకు లేదన్నారు. సిట్ దర్యాప్తుపై అనుమానాలుంటే.. ఫిర్యాదు చేయవచ్చని అన్ని వివరాలు తెలుస్తాయని చెప్పారు. వీడియోల ద్వారా బాధితుల్ని ఎవరైనా బ్లాక్ మెయిల్ చేస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కవితకు మళ్లీ నిరాశే

న్యూఢిల్లీ, మే 10 ,ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై.. ప్రస్తుతం తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్నిసార్లు ప్రయత్నించినా బెయిల్ మంజూరు కావడంలేదు. ఇప్పటికే పలుమార్లు బెయిల్ రిజెక్ట్ అవ్వగా.. ఈసారి బెయిల్ కోసం ఢిల్లీ హై కోర్టును ఆశ్రయించారామె. ఈ మేరకు 1149 పేజీలతో బెయిల్ పిటిషన్ ను దాఖలు చేశారు.మే 6వ తేదీన ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్ కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్లను రౌస్ కోర్టు డిస్మిస్ చేసింది. దానిని సవాల్ చేస్తూ.. ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది కవిత. కవిత బెయిల్ పిటిషన్ పై వాదనలకు సమయం కావాలని కోరింది ఈడీ. ఈడీ సమయం కోరడంతో .. తదుపరి విచారణను మే 24కు వాయిదా వేసింది. మరోసారి కవితకు నిరాశ తప్పలేదు. మే 24న ఈడీ వాదనల విన్న అనంతరం ఢిల్లీ హై కోర్టు తీర్పునిచ్చే అవకాశాలున్నాయి.ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో కవితను మార్చి 15న ఈడీ అరెస్ట్ చేసి.. కోర్టు అనుమతితో విచారించింది. ఆ తర్వాత ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది.

# జోరుగా ఫ్యామిలీ ప్యాక్ పాలిటిక్స్

విజయవాడ, మే 10, (న్యూస్ పల్స్) వైఎస్, కొణిదెల, నారా-నందమూరి.. ఏపీలో ఎన్నికలు ఆ నాలుగు కుటుంబాలే కేంద్రంగా జరుగుతున్నాయి. ఎవరు ఔనన్నా ఎవరు కాదన్నా ఇదే వాస్తవం. రేపటిరోజున జయాపజయాలు, వాటి పర్యవసానాల ఎఫెక్ట్ నేరుగా ఆ నాలుగు కుటుంబాల మీదే పడబోతోంది. కానీ.. గ్రౌండ్ లెవల్‌లో కూడా ఇటువంటి ఫ్యామిలీ సర్కస్ ఫీట్లు చాలానే ఉన్నాయి. డజనుకు పైగా కుటుంబాలనుంచి మల్టిపుల్ క్యాండేట్లను బరిలో దింపి.. ఫ్యామిలీ ప్యాక్ పాలిటిక్స్‌ని జోరుగా షురూ చేశాయి ఏపీలో ప్రధాన పార్టీలు.ఒక కుటుంబం నుంచి ఒక్కరికే టికెట్ ఇవ్వాలనేది రాజకీయాల్లో పాటించాల్సిన నైతిక నిబంధన. కానీ.. అది కాస్తా గాల్లో కలిసిపోయింది. ఒక్కో ఫ్యామిలీకి గరిష్టంగా నాలుగేసి టిక్కెట్లిచ్చి గౌరవించుకుంటూ ముందుకెళ్తున్నాయి ప్రధాన రాజకీయ పార్టీలు. కుటుంబ రాజకీయాలు వద్దువద్దంటూనే ఆ కొన్ని కుటుంబాలకు మాత్రమే పెద్దపీటలేసి గెలుపే పరమావధిగా పావులు కదుపుతున్నాయి.నారా-నందమూరి కుటుంబాలకు చెందిన మొత్తం నలుగురిని పోటీలో దింపింది తెలుగుదేశం పార్టీ. కుప్పం నుంచి చంద్రబాబు, మంగళగిరి నుంచి ఆయన తనయుడు లోకేష్ పోటీ చేస్తున్నారు. చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ మూడోసారి హిందూపురం నుంచి విక్టరీ కోసం ప్రయత్నిస్తున్నారు. బోనస్‌గా బాలయ్య పెద్దల్లుడు శ్రీభరత్ విశాఖ ఎంపీగా టీడీపీ తరఫున బరిలో నిలిచారు. కాకపోతే.. ఈ నలుగురూ.. 2019 ఎన్నికల్లో కూడా ఫైట్ చేసినవాళ్లే.టీడీపీలో ఆ తర్వాత చెప్పుకోవల్సింది యనమల ఫ్యామిలీ ప్యాక్ గురించే. మాజీ ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు కూతురు దివ్యకు తుని అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు. కడపలో ఉన్న యనమల అల్లుడు పుట్టా మహేష్ యాదవ్‌కు ఏలూరు ఎంపీ సీటు దక్కింది. యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్ కడప జిల్లా మైదుకూరు అసెంబ్లీ సీటుకు పోటీ చేస్తున్నారు. సో.. టోటల్‌గా యనమల ఖాతాలో నాలుగు టిక్కెట్లు పడ్డట్టు లెక్క.కింజరపు ఎర్రన్నాయుడు ఫ్యామిలీ.. రెండు అసెంబ్లీ, ఒక ఎంపీ సీటు మీద కర్చీఫ్ వేసింది. ఎర్రన్నాయుడు తనయుడు రామ్మోహన్ నాయుడు సిక్కోలు ఎంపీగా హ్యాట్రిక్ కోసం ట్రై చేస్తున్నారు. ఎరన్నాయుడు సోదరుడు అచ్చెన్నాయుడు టెక్కలి అసెంబ్లీ సీట్లో బరిలో ఉన్నారు. ఎర్రన్నాయుడు అల్లుడు ఆదిరెడ్డి వాసు రాజమండ్రి సిటీ నుంచి టీడీపీ తరపున పోటీ చేస్తున్నారు.సింహపురి రాజకీయాల్లో భార్యాభర్తల సీజన్ నడుస్తోంది. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పోటీ చేస్తుంటే, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి కోవూరు అసెంబ్లీ సీట్లో బరిలో ఉన్నారు. మాజీ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు సిటీ సెగ్మెంట్‌లో పోటీలో ఉంటే.. ఆయన వియ్యంకుడు గంటా శ్రీనివాసరావు భీమిలి నుంచి బరిలో ఉన్నారు. ఫ్యామిలీ పాలిటిక్స్‌లో టీడీపీ కంటే వైసీపీ నాలుగాకులు ఎక్కువే చదివినట్టుంది. పెద్దిరెడ్డి, బొత్స లాంటి కుటుంబాలకు బంపరాఫర్లు ఇచ్చి.. ఈసారి ఎన్నికల్లో ఫ్యామిలీ స్టార్‌డమ్‌ని రెట్టింపు చేసింది.పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడోసారి బరిలో నిలిచారు సీఎం జగన్మోహన్‌రెడ్డి. అటు.. జగన్ కజిన్ బ్రదర్ అవినాష్‌రెడ్డి కూడా కడప ఎంపీగా మూడోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కమలాపురం సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉంటూ మళ్లీ టికెట్ దక్కించుకున్న రవీంద్రనాథ్‌రెడ్డి జగన్‌కి మేనమామ. వైఎస్ ఫ్యామిలీకి మరో సమీప బంధువు బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. సో.. వైఎస్ ఫ్యామిలీ ఖాతాలో వైసీపీ నుంచి ఐదుగురు పోటీలో ఉన్నట్టు లెక్క.చిత్తూరు జిల్లాలో వైసీపీకి పెద్దదిక్కుగా ఉన్న పెద్దిరెడ్డి ఫ్యామిలీ సైతం ఈసారి ట్రిపుల్ ధమాకా కొట్టింది. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాలుగోసారి పోటీ చేస్తుంటే, ఆయన తనయుడు మిథున్ రెడ్డి రాజంపేట ఎంపీగా రెండోసారి బరిలో ఉన్నారు. సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి తంబళ్లపల్లి టికెట్ సంపాదించారు. పెద్దిరెడ్డి తర్వాతి ప్లేస్ చెవిరెడ్డి ఫ్యామిలీది. తన చంద్రగిరి సీటును కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఇప్పించుకుని, ఒంగోలు ఎంపీగా ప్రమోషన్ తీసుకున్నారు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి.కర్నూలు బ్రదర్స్‌గా పేరున్న ముగ్గురికి ఛాన్స్ ఇచ్చింది వైసీపీ అధిష్టానం. వై బాల నాగిరెడ్డి మంత్రాలయం నుంచి, వై వెంకట్రామిరెడ్డి గుంతకల్ నుంచి, వై. సాయిప్రసాద్ రెడ్డి ఆదోని నుంచి ఫ్యాను గుర్తుపై పోటీ చేస్తున్నారు. బోనస్‌గా వీళ్ల బంధువు అనంత వెంకట్రామిరెడ్డికి అనంతపురం ఎంపీ టికెట్ ఇచ్చింది వైసీపీ హైకమాండ్. ఎర్రగొండపాలెం నుంచి రెండుసార్లు గెలిచిన మంత్రి ఆదిమూలపు సురేష్.. ఇప్పుడు కొండపి అసెంబ్లీ టికెట్ తీసుకున్నారు. ఆయన సోదరుడు ఆదిమూలపు సతీష్ కొడుమూరు నుంచి పోటీలో ఉన్నారు. మరో మంత్రి అంబటి రాంబాబు సత్తెనపల్లి నుంచి బరిలో ఉంటే.. ఆయన సోదరుడు అంబటి మురళీకృష్ణ పొన్నూరు నుంచి పోటీ చేస్తున్నారు. ఇటువంటిదే ఉత్తరాంధ్రలో ధర్మాన బ్రదర్స్ తీరు. శ్రీకాకుళం నుంచి ధర్మాన ప్రసాదరావు, నరసన్నపేట ధర్మాన కృష్ణదాసు పోటీ చేస్తున్నారు.అనంతపురం జిల్లా ధర్మవరం నుంచి కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆయన బాబాయ్ కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నారు.

వీళ్లిద్దరూ సిట్టింగులే. నెల్లూరు జిల్లాలో మేకపాటి ఫ్యామిలికి సైతం డబుల్ ధమాకా దక్కింది. ఆత్మకూరు నుంచి మేకపాటి విక్రమ్ రెడ్డి, ఉదయగిరి నుంచి ఆయన పెదనాన్న మేకపాటి రాజగోపాల్ రెడ్డి పోటీలో ఉన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు నుంచి గెలిచి మంత్రిగా అవకాశం దక్కించుకున్న కారుమూరి నాగేశ్వరరావు ఇప్పుడు అదే తణుకు నుంచి పోటీ చేస్తూ.. అదనంగా కుమారుడు సునీల్ కుమార్‌కు ఏలూరు ఎంపీ టికెట్ ఇప్పించుకున్నారు.ఇక చివరిగా వైసీపీలో మరో బిగ్ అండ్ బిగ్గెస్ట్ ఫ్యామిలీ.. విజయనగరం జిల్లాను అడ్డాగా మార్చుకున్న బొత్స కుటుంబం. తనను మూడుసార్లు గెలిపించిన చీపురుపల్లి ఓటర్లనుంచి మరోసారి తీర్పు కోరుతున్నారు మంత్రి బొత్స సత్యనారాయణ. ఆయన సతీమణి ఝాన్సీ ఈసారి వైసీపీ తరపున విశాఖ ఎంపీగా బరిలో ఉన్నారు. బొత్స సోదరుడు అప్పల నరసయ్య గజపతినగరం వైసీపీ టికెట్ వరించింది.రాజకీయంగా పలుకుబడి ఉన్న కుటుంబాల్లో, స్థానికంగా వాళ్లవాళ్ల బలాల్ని బట్టి ఇద్దరికి టికెట్లు ఇచ్చిన సందర్భాలు అనేకం. కానీ.. క్రమంగా ఆ స్కోరు పెరిగి.. ఇప్పుడు పావు డజనుకి మించి అభ్యర్థులకు ఛాన్స్ ఇచ్చాయి పార్టీలు. నేటి రాజకీయాల్లో కష్టపడే నేతలకే ఎంకరేజ్‌మెంట్ అనే కవరింగులు ఇచ్చుకుంటూ ఫ్యామిలీ పాలిటిక్స్‌ని విచ్చలవిడిగా ప్రోత్సహించడం ఒక తప్పనిసరి అలవాటుగా మారింది.

## ఓ... ఓటరాన్నా ఈ సారి నీరేటు 2వేలా.....

పథకాలు అందిన వారికే ఇస్తున్నారు అంటూ గుసగుసలు




అనపర్తి శ్రీ ప్రస్థానం ప్రతినిధి:తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం లో ఓటుకు 2వేలు రేటు నిర్ణయించినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి అంతేకాకుండా గురువారం నుండే ఒక పార్టీ పంపకం కూడా మొదలుపెట్టారని అనుకుంటున్నారు వాలంటరీ రాజీనామా చేపించి అదే వాలంటీర్ల ద్వారా కూడా తిరుగుతూ పథకాలు పొందిన వారు కచ్చితంగా ఓటు వేస్తారని వాళ్లకి మాత్రమే ఓటుకు 2వేలు చప్పున ఇస్తున్నారని పథకాలు రానివారికి ఓటు వేయరని వారికి మాత్రం ఇవ్వడం లేదని డబ్బులు అందని ఓటర్లు బాధపడుతున్నారని వాళ్లకు రాలేదని ఒకరినొకరు చెప్పుకుంటున్నారు. ఇస్తే ప్రతి ఓటరికి ఓటుకు 2వేలు చప్పున ఇవ్వాలి గాని నచ్చిన వాళ్ళకి ఇచ్చి నచ్చని వాళ్ళకి ఇవ్వకపోతే అటు ఇటుగా ఉన్న ఓటు శాతం కూడా తగ్గే అవకాశం ఉంది అని కూడా అనుకుంటున్నారు ఏదేమైనా ఎన్నికల కమిషన్ ఎలక్షన్ కోడ్ అంటూ ఎంత హంగామా చేసిన యధావిధిగా పంపకం మాత్రం జరుగుతుందని స్థానికులు చెవులు కోరుకుంటున్నారు. లోకల్ నాయకులు వాళ్ళకు వ్యతిరేకంగా వున్న వారికి ప్రతిపక్ష ముద్ర వేసి వాళ్ళకు డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పటి వరకు వున్న అభిమానం కూడా కోపంగా మారి ఓటు ఎదుట పార్టీ కి పోయేలా ఉందని ఇక్కడి ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఏది ఏమైన పంపకం సరిగ్గా లేకపోతే డబ్బు పోయే ఓట్లు పోయే అంటున్నారు స్థానికులు.

## ఎన్నికల వేళ టిడిపి లో చేరికలు....!



మే 10 కుక్కునూరు (ప్రస్థానం న్యూస్) కుకునూరు మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు ఆద్వర్యంలో కుకునూరు మండలం ఉప్పేరు గ్రామం నుండి వైఎస్సార్ సిపి పార్టీ నుంచి పోలిబోయిన పుల్లారావు తెలుగు దేశం పార్టీ లోచేరిక.ములిశెట్టి నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు ఈకార్యక్రమంలో పాల్గొన్నా నాయకులు పిచ్చుక రాజు.ముప్పాల శివ. చుంచు సత్యనారాయణ. ఏసుబాబు అల్లాడి సురేష్. రెడ్డి . తాండ్ర రవి. చల్లకోటి.కోటేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికలవేళ వైసిపి నుంచి టిడిపిలో చేరిక.

ప్రచార నిర్వహిస్తున్న టిడిపి నాయకులు.



నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల పరిధిలోని చిన్న కంబలూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఎన్నికలవేళ టిడిపిలో చేరారు. శుక్రవారం టిడిపి ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామానికి చెందిన వైసిపి నాయకులుగౌస్ ఫీరా వీరి అనుచర వర్గం టిడిపి నాయకుడు జంగా పెద్ద పుల్లారెడ్డి, జంగా వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఇందులో భాగంగా చిన్న కంబలూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిలప్రియను భారీ మెజార్టీతో గెలిపించడమే ధ్యేయంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకుడు జంగా రాజశేఖర్ రెడ్డి, జంగా సుదర్శన్ రెడ్డి, ఎడవలి శ్రీనివాసులు యాదవ్, భాస్కర్ రెడ్డి పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## సైకిల్ గుర్తుకు ఓటు వేసి భూమా అఖిల ప్రియ, ను అఖండ మైనా భారీ మెజారిటీతో గెలిపిద్దాం.

క్రిష్టిపాడు గ్రామ టిడిపి నాయకులు బి. వెంకట రామి రెడ్డి..



దొర్ని పాడు,మే:10, శ్రీ ప్రస్థానం న్యూస్:- మీ అమూల్య మైనా ఓటును ఆలోచించి తప్ప నిసరిగా సైకిల్ గుర్తుకు ఓటు వేసి వేయించి ఆళ్లగడ్డ కూటమి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిల ప్రియ,ను అఖండ మైనా భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరుతూ క్రిష్టి పాడు గ్రామ టిడిపి నాయకులు బి.వెంకట రామి రెడ్డి, ఓటర్లను కోరారు.. ఎన్నిక ల ప్రచార కార్యక్రమంలో భాగంగా కూటమి ఎమ్మేల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నా భూమా అఖిల ప్రియ ఆదేశాల మేరకు శుక్ర వారం మండలంలోని క్రిష్టి పాడు గ్రామ టిడిపి నాయకులు బి.వెంకట రామి రెడ్డి, కట్టుబడి రహీం బాషా, ఎంపీటీసీ సభ్యులు కె.మహ బూబ్ బాషా,ల సారాద్యం లో కార్యకర్త లతో పాటు కలసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.. గ్రామంలోని పలు కాలనీ లో ఇంటింటి కి తిరుగుతూ తెలుగు దేశం పార్టీ రూపొందించిన మినీ మేనిఫెస్టో లోనీ సూపర్ సిక్స్ పథకాలతో పాటు విద్యా, వైద్యం వ్యవసాయం వంటి వివిధ సంక్షేమ పథకాలతో నూతనంగా రూపొందించిన మరో మేనిఫెస్టో లోని పథకాలను గూర్చి కరపత్రాల ద్వారా ప్రజలకు అర్థం అయ్యేలా చదివి వివరిస్తూనే .. వైసిపి.ప్రభుత్వం యెక్క ప్రజా వ్యతిరేక విధానాలను ఎండకడుతూ..ప్రజలకూ వివరించారు..రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ అధికారం లోకి రాగానే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే వివిధ సంక్షేమ పథకాలతో పాటు బావి తరాల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని టిడిపి జాతీయ అద్యక్షులు మాజీ ముఖ్య మంత్రి వర్యులు గౌ శ్రీ నారా చంద్రబాబు నాయుడు, చేపట్ట బోయే పలు అభివృద్ధి కార్యక్రమాలను గుర్చి ప్రజలకు వివరిస్తూ... ఇంటి ఇంటి ప్రచారం నిర్వహించారు... మే 13 న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ జనసెనా- బిజెపి-టిడిపి,కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న భూమా అఖిల ప్రియ,ను నంద్యాల టిడిపి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న బైరెడ్డి శబరి,లను ప్రజలందరూ కూడా ఆశీర్వదించి టీడిపి రెండు సైకిల్ గుర్తులకు ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీ తో గెలిపించి మన నియోజక వర్గ సమస్యల పై గళం వినిపించేలా భూమా అఖిల ప్రీయను ను అసెంబ్లీ కి, అలాగే మన రాష్ట్ర ప్రజల సాకారం ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పనుల పై గళం వినిపించేందుకు బైరెడ్డి శబరి, లను పార్లమెంట్ కు పంపుదాం అని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు..ఈ కార్య క్రమంలో గ్రామ కూటమి నాయకులు బి.వెంక టేశ్వర రెడ్డి, సి.ఏ.ప్రభాకర్ రెడ్డి, వి. ఏ.నాగేశ్వర రెడ్డి,,బి. శివ రామి రెడ్డి, ఎం.వెంకట పుల్లయ్య, పెట్నికోట బాషా,ఎం.బాషా, మహబూబ్ దౌలా, అవుకు పక్కిర్ వలి,సీ. మాలిక్ బాషా, టి. తొలశి, శ్రీకాంత్, ముస్కింసా గారి బాషా,హిదాయి తుల్ల, కుంట కట్ట, మబాష, కే.సీఎం.బాషా,బి.చిన్న మహమ్మద్, అల్లేసా గారి చంద్ బాషా, ఆర్.భాస్కర్ రెడ్డి,పి.బాషా, టి.బాలస్వామి, జీ . పెద్ద గుర్రన్న,జీ.గురన్న, ఎస్. నాగేంద్ర,భూమా శోభా నాగిరెడ్డి దంపతుల అభిమా నులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు...

## ఎన్నికల వేళ వైసీపీ లోకి చేరికలు....!



టీడీపీని వీడి వైసీపీ లో చేరిన ముప్పాల సత్యనారాయణ....!

మే 10 కుక్కునూరు (ప్రస్థానం న్యూస్) ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి వైసీపీ లో చేరిన ముప్పాల సత్యనారాయణ.ఈరోజు ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీని విడి వైసీపీ తీర్థం పుచ్చుకున్న ముప్పాల, అయన రాకతో కుక్కునూరు మండల టీడీపీ కి గండి, 15 పంచాయితిల పరిధిలో చక్రం తిప్పకగల వ్యక్తి, రాజకీయ అపర చనిక్యుడు ముప్పాల.ఈ సందర్భంగా ముప్పాల మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి బీద,బడుగు బలహీన వర్గాలకు చేతున్న మంచిని చూసి పార్టీలోకి వచ్చాను అని అన్నారు.ఇన్ని సంవత్సరాల కాలంలో ఏ ముఖ్యమంత్రి చెయ్యని సంక్షేమ అభివృద్ధి ని చేసి చూపించిన ఏకైక వ్యక్తి జగన్ మోహన్ రెడ్డి అన్నారు.జగనన్న ప్రభుత్వం అధికారం చేపట్టిన తరవాత గ్రామా, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా పరిపాలనను గ్రామాలకు పరిమితం చేసారు అని అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇచ్చిన దాఖలు లేవు అని, పైగా జన్మభూమి కమిటీల ద్యారా బీద ప్రజలకు అందే అన్ని రకాల పథకాలు దోచుకొని తిన్నారు అని అన్నారు.జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గర నుండి బీద, బడుగు భలహీన వర్గాల ప్రజలు రెండు పూటలా తింటున్నారు అని, ప్రజలు పచ్చగా ఉంటాం ఓర్వలేక రాష్ట్రాన్ని అప్పుల పలు చేస్తున్నాడు జగన్ అని పచ్చమీడియా ద్యారా విషం చిమ్ముతున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేసారు.ప్రజలు మరొక్క సారి జగన్ మోహన్ రెడ్డి కి పట్టం కట్టడానికి రాడీగా ఉన్నారు అని, చంద్రబాబు భూటాకపు మాటలు నమ్మే పరిస్థితి లేదు అని, 2014లో 650 హామీలు ఇచ్చి మాయమాటలు చెప్పీ అధికారం చేపట్టిన తరవాత వాటిని చెయ్యలేక వెబ్ సైట్ నుండి మ్యానిఫెస్టో డిలీట్ చేసిన మోసగాడు చంద్రబాబు అని అన్నారు.జగన్ మోహన్ రెడ్డి నవరత్నా పథకాలు ఇస్తా అని చెప్పి, చెప్పిన మాటకు కట్టుబడి నిరవేర్చారు అని, చెప్పనవి కూడా చేసిన ఘనత జగన్ మోహన్ రెడ్డి కి దక్కుతుందిని మ్యానిఫెస్టోలో చెప్పిన వాటిని 99% అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వై.యస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ, కుంజ నాగేశ్వరరావు ఎంపీపీ, చేబ్రోలు గీతవాణి వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, మండల పార్టీ అధ్యక్షులు కుచర్లపాటి నర్సింహారాజు, మరియు మండల నాయకులూ, కార్యకర్తలు, అన్ని పంచాయితిల సర్పంచులు, ఎంపీటీసీలు వార్డు మెంబర్లు, వివిధ అనుభంద సంగాల నాయకులు తడితరులు పాల్గొన్నారు.

## ఆలమూరు శీల బోయిన చెరువులో చేపల మృతి.

రూ 8 లక్షల పైగా నష్టం.ఆందోళన చెందుతున్న బెస్తలు

.మృతి చెందిన చేపలను పరిశీలించిన వైసీపీ నాయకులు.





నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలో ఉన్న శిలబోయిన చెరువులో రూ 8 లక్షల పైగావిలువచేసే చేపలు మృతి చెందాయి. వివరాల్లోకెళితే ఆలమూరు గ్రామానికి చెందిన బెస్తలు ఈ ఏడాది శిలబోయిన చెరువులో చేపల పెంపకం చేపట్టారు. ప్రస్తుతము గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు కొత్త నీరు వచ్చి చేరడంతో చెరువులో ఉన్న చేపలు అస్వస్థతకు గురై మృతి చెందాయి. దీంతో దీంతో బెస్తలకు రూ 8 లక్షల పైగా నష్టం వాటిల్లింది. మృతి చెందిన చేపలను గ్రామానికి చెందిన మండల సచివాలయం కన్వీనర్, వైసిపి నాయకులు పాణ్యం నాగేష్,, పాణ్యం చంద్ర, దేవస్థానం కమిటీ చైర్మన్ సూలం ప్రభాకర్, బాలయ్య, పిల్లి సుబ్బారావు, పెద్ద ఈశ్వరయ్య ,హుస్సేన్ ఆన్సర్ వలి ,చెన్నయ్య, రహీం ,నజీర్ ,పోజు భాష, ముత్తులూరు రాజా, గుత్తికొండ పుల్లయ్య పలువురు నాయకులు మృతి చెందిన చేపలను పరిశీలించి బెస్తలకు ప్రభుత్వపరంగా నష్టపరహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తమవంతుగా వారిని ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

## చలమ రేంజిలో చిరుత పులులు ఎలుగు బంటిల సంచారం.

సాయంత్రం 6 నుంచి ఉదయం 6 వరకు ప్రయాణం వాయిదా వేసుకోండి...

రేంజ్ అధికారి ఈశ్వరయ్య.

నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-చలమ రేంజి లో ఉన్న నంద్యాల, గిద్దలూరు ప్రధాన రహదారిలో ఉన్న అభయారణ్యంలో సాయంత్రం 6 నుంచి ఉదయం 6



వరకు ప్రయాణం వాయిదా వేసుకోవాలని చలమరేంజ్ అధికారి ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాగర్జున శ్రీశైలం రిజర్వ్ ఫారెస్ట్ లో పెద్ద పులుల అభయరన్యం నంద్యాల గిద్దలూరు రహదారిలో అంకిరెడ్డి చెరువు నుండి ప్రకాశం జిల్లా సరిహద్దు వరకు చలమ రేంజ్ పరిధిలో చిరుతపులులు మరియు ఎలుగుబంటి ల సంచారం ఎక్కువగా ఉందన్నారు. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులపై చిరుత పులులు, ఎలుగుబంటి లు దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కావున ఈ రహదారిలో ప్రయాణం చేసే వాహనదారులు సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా కోరారు.

# ప్రశాంత పోలింగ్ కు పటిష్ట చర్యలు



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు

శ్రీ ప్రస్థానం- నంద్యాల , మే 10 :- సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అత్యంత పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో సాధారణ ఎన్నికలు - 2024 సంబంధించి పోలింగ్ కు ముందు చివరి 72 గంటల ప్రోటోకాల్, తదితర అంశాలపై జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డితో కలసి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు మీడియా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ పోలింగ్ కు ముందు చివరి 72 గంటలు అత్యంత కీలకమైందని... ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రానున్న మూడురోజులు అత్యంత కీలకమైనవని, రిటర్నింగ్ అధికారులు ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమవుతున్న నేపథ్యంలో అదనపు బ్యాలెట్ యూనిట్లు తెప్పించి కమిషన్ నిర్వహించి అన్ని నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచామన్నారు. ఈనెల 12వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీన ఎన్నికల పోలింగ్ రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంకాలం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయకుండా, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. 1350 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్, 335 లొకేషన్ల లోని 403 పోలింగ్ కేంద్రాలలో మైక్రో అబ్జర్వర్లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లందరికీ సచివాలయ సిబ్బంది ద్వారా స్లిప్పులు పంపిణీ చేయిస్తున్నామన్నారు. ఈవీఎంలను తరలించే వాహనాలను జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ రోజున ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా షామియానాలు వేయడం తోపాటు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రతి లొకేషన్ లో వికలాంగుల సౌకర్యార్థం వీల్ ఛైర్స్ ఏర్పాటు చేసామన్నారు. ఎక్సైజ్ కి సంబంధించి డ్రై డే ఇప్పటికే ప్రకటించామని, పోలింగ్ కు 48 గంటలు డ్రై డే ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ ఎలాంటి హింసాత్మక సంఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు మీడియా కూడా సహకరించాలన్నారు. సరిహద్దుల్లోని 8 అంతర్గత చెక్పోస్టుల ద్వారా అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని నియోజకవర్గంలోని నియోజకవర్గ ఓటర్ తప్ప ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఉంటే బయటికి పంపించే ప్రక్రియ మొదలవుతుందన్నారు. అలాగే మ్యారేజ్ ఫంక్షన్ హాల్, కమ్యూనిటీ హాల్, ల్యాడ్జియంగ్ లాంటి వాటిని కూడా ట్యాప్ చేయడం జరిగిందని, ఎవరు వస్తున్నారు? ఏం చేస్తున్నారు? ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు? తదితరాలన్నింటిని పరిశీలిస్తున్నామన్నారు. ఎక్కడైనా నగదు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు అవుతుందన్నారు. జిల్లాలో చాలా పగడ్బందీగా ఎన్నికల నిర్వహణ చేయడం జరుగుతోందన్నారు. రాత్రిపూట తనిఖీలను పెంచామని, ర్యాండమ్ గా తనిఖీలు జరుగుతుంటాయన్నారు. పోలింగ్ కేంద్రానికి రెండు వందల మీటర్ల దూరం బయటనే రాజకీయ పార్టీలు ఎలక్షన్ బూత్ పెట్టుకోవాలనుకుంటే పెట్టుకోవచ్చన్నారు. ఎన్నికల సంబంధిత అధికారులు తప్ప పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల ఎవరూ ప్రవేశించడానికి వీలులేదన్నారు. ఇతరలెవరైనా లోపలికి ప్రవేశిస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కోసం 4 కంపెనీల పోలీసు బలగాలు కూడా రావడం జరిగిందన్నారు. కేంద్ర బలగాలు కూడ రానున్నాయని స్ట్రాంగ్ రూము, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ వివరించారు. ఓటర్లను ఒక పార్టీకి చెందిన సపోర్టర్లు వారి ప్రాంతం వాహనాలు తీసుకురావడానికి వీలులేదని, అలాచేస్తే సంబంధిత వాహనాలు సీజ్ చేస్తామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో క్యూ,ఆర్ టీమ్ లు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757